# క్రైమ్ THE మిర్రర్®

15 ANNIVERSARY

Voice of Anti Corruption

హైదరాబాద్
9-5-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 36

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఎసౌదీ విదేశాంగ మంత్రి భారత్ రాక

విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ

9లో



## దద్దరిల్లిన కర్రెగుట్టలు

ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టుల మృతి

18 మృతదేహాల స్వాధీనం

కొనసాగుతున్న కూంబింగ్

1లో



## హైజాక్ మాస్టర్‌మైండ్ అబ్దుల్ రవూఫ్ అజహార్ హతం..!

7లో



ఆపరేషన్ కగార్, బచావో కర్రెగుట్టల అంశంపై మంత్రి సీతక్క ఎమోషనల్ అయ్యారు. రాజ్యాంగ విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం ఎన్ కౌంటర్లు చేయొద్దని కోరారు. ఆదివాసీలతో తనకు పేగు బంధం ఉందని, వెంటనే పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్టల్లో భారీ ఎన్ కౌంటర్ నేపథ్యంలో క్రైమ్ మిర్రర్ కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నక్సల్స్ ఉద్యమం, నిజాం కు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం, రైతాంగ పోరాటం, కొమురం భీం వంటి పోరాటాలన్నీ ఆదివాసుల నైజంగా పేర్కొన్నారు.

# ఆదివాసులను చంపేస్తారా.. ?

### ఎన్ కౌంటర్లు రాజ్యాంగ విరుద్ధం

వెంటనే పోలీసు బలగాలను ఉపసంహరించాలి.

అడవి బిడ్డలతో నాకు పేగు బంధం ఉంది.

స్థానిక సమస్యల పైనే వారి పోరాటం.

మంత్రి సీతక్క ఎమోషనల్.



**తెలంగాణ బ్యూరో, క్రైమ్ మిర్రర్ :** ఆపరేషన్ కగార్, బచావో కర్రెగుట్టల అంశంపై మంత్రి సీతక్క ఎమోషనల్ అయ్యారు. రాజ్యాంగ విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం ఎన్ కౌంటర్లు చేయొద్దని కోరారు. ఆదివాసీలతో

(మొదటి పేజీ తరువాయి)



# యుద్ధం మొదలు

### దాయాది దుస్సాహసం, దీటుగా బదులిచ్చిన భారత్

### లాహోర్ నుంచి కరాచీ దాకా ముప్పేట దాడులు

### తారస్థాయికి భారత్, పాక్ ఉద్రిక్తతలు

### పూర్తిస్థాయి యుద్ధం దిశగా పరిస్థితులు



న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: అవమాన భారంతో విచక్షణ కోల్పోయిన దాయాది దిద్దుకోలేని పొరపాటు చేసింది. బుద్ధి తెచ్చుకోవాల్సింది పోయి పూర్తిగా బరితెగించింది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారం చేయబోయి మరోసారి పరువు పోగొట్టుకుంది. భారత్‌ను సైనికంగా రెచ్చగొట్టే దుస్సాహసానికి పూనుకుని అభాసుపాలైంది.

మిగతా 7లో

## పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా

శవపేటికలపై పాక్ జెండాలు కప్పడంలో అర్థం ఏమిటో

పాకిస్థాన్‌లో ఇలాంటి ఆచారం ఉందేమో

ఉగ్రవాదులు లక్ష్యంగానే భారత్ దాడులు


గతంలో దాడులకు సంబంధించిన వివరాలు ఎన్నో ఇచ్చాం

పాక్ దేనికి సరైన సమాధానం ఇవ్వలేక పోయింది

విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి

## పాక్ ప్రధాని ఇంటి సమీపంలో భారీ పేలుళ్లు..

నివాసం నుంచి షరీఫ్ తరలింపు





మిగతా 7లో

## విద్యుత్ సరఫరా నిలిపివేత..

సరిహద్దు రాష్ట్రాల్లో 'హై అలర్ట్'!

భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్న





## మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు

ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న నలుగురు మంత్రులు

**ఖమ్మం,(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

మిగతా 2లో

## ఉగ్రవాదాన్ని ఎగదోస్తే.. మీకు నూకలు చెల్లినట్లే

భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాల్సిందే

దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తే తాటతీస్తాం

ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా ర్యాలీలో సిఎం రేవంత్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని

మిగతా 2లో



## సుందరీమణులు సిద్ధం..

రేపట్నుంచే హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభ కార్యక్రమం

పోటీలకు బందోబస్తు సహా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసిన ప్రభుత్వం

ఇప్పటికే నగరానికి చేరుకున్న 100 మందికి పైగా అందగత్తెలు

## పాక్,భారత్ మధ్య ఉద్రిక్తతలు

### నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబయి,(క్రైమ్ మిర్రర్):** భారత్– పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. . భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు పాక్ యత్నించింది. దీంతో ఆ దేశంలో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ వార్తల నేపథ్యంలో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఉద్రిక్తతల నేపథ్యంలో చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,300 దిగువకు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఉదయం 80,912.34 పాయింట్ల (క్రితం ముగింపు 80,746.78) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య చలించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.72గా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం పతనం అవ్వగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హెచ్‌సీఎల్ – టె–క్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, –టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 61.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

భారత్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలవుతోంది.

## దద్దరిల్లిన కర్రెగుట్టలు

భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎదురుకాల్పులతో కర్రెగుట్టలు ఎర్రబారాయి. బీజాపుర్ జిల్లా ఊసూరు ఠాణా పరిధిలోని ఈ గుట్టల్లో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి విజయశర్మ ఈ ఎదురుకాల్పుల ఘటనను ధ్రువీకరించారు. డ్రోన్ కెమెరాలు, వైమానిక దళ హెలికాప్టర్లు, ఇతర అత్యాధునిక సాంకేతికతతో మావోయిస్టుల కదలికలను గుర్తించి.. బలగాలు కూంబింగ్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు 18 మంది మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భీకర ఆపరేషన్ కొనసాగుతోందని వెల్లడించారు. దిల్లీ నుంచి సీఆర్పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్, ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ ఆపరేషన్ ఏడీజీ వివేకానంద సిన్హా, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

## ఆదివాసులను

# చంపేస్తారా..?



(మొదటి పేజీ తరువాయి)

తనకు పేగు బంధం ఉందని, వెంటనే పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్టలో భారీ ఎన్ కౌంటర్ నేపథ్యంలో క్రైమ్ మిర్రర్ కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నక్సల్స్ ఉద్యమం, నిజాం కు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం, రైతాంగ పోరాటం, కొమురం భీం వంటి పోరాటాలన్నీ ఆదివాసుల నైజంగా పేర్కొన్నారు. ఆనాడు బ్రిటిష్, రాజులకు, నేడు నియంత పాలనకు వ్యతిరేకంగా ఆదివాసులు పోరాడుతూనే ఉన్నారన్నారు. వారి డిమాండ్లు, పోరాటం మొత్తం... దోపిడీ, వివక్ష , అన్యాయం మీదనే ఉంటుందని, ఉద్యమాలు స్థానిక సమస్యల మీద పురుడుపోసుకుంటాయని చెప్పారు. మావోయిస్టులు శాంతి చర్చలకు అంగీకరించారని... వారు మన దేశ పౌరులే కాబట్టి, రాజ్యాంగానికి లోబడి ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సమస్య లేకుండా శాంతియుతంగా వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకు రావాలన్నారు. కర్రెగుట్టలపై ఆదివాసులు ఇబ్బంది పడుతున్నారని, పోలీసుల చర్యతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తునికాకు కోసుకుంటేనే వారికి ఆదాయమని... ఇది ఇప్పపువ్వు సీజన్ అని... అదే వారి జీవనాధారమన్నారు. కానీ పోలీసులు మోహరించడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని... వారికి అటవీ ఉత్పత్తుల మీద హక్కు ఉందన్నారు. కాబట్టి బలగాలు వెంటనే అక్కడనుంచి వచ్చేయాలని ఒక ఆదివాసీ బిడ్డగా కోరుతున్నట్లు చెప్పారు.

### చంపడం రాజ్యాంగ విరుద్ధం !

శాంతి చర్చల కమిటీతో ప్రజల హక్కుల గురించి చర్చించాం. ఆదివాసులు భయాందోళనలో బతుకుతున్నారు. నీటి కుంటల్లో చేపలు తిని బతుకుతారు. తునికాకు తెచ్చుకుని తింటారు. అందుకే వారి జీవన విధానం గురించి ఆలోచించాలి. ఉద్యమ సిద్ధాంతం మర్చిపోయాం. కానీ ఆదివాసీలతో పేగు బంధం ఉంది. ఆ జీవితం నుంచి వచ్చిన నాకు బాగా తెలుసు. అడవిలో ఎవరు ఉండమన్నారు అని కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ వందల ఏళ్లుగా అక్కడే బతుకుతున్నాం. ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజల ప్రయోజనాలే మనకు ముఖ్యం. హింసకు హింస తోనే పరిష్కారం అంటే ప్రజలు వ్యవస్థ మీద నమ్మకం కోల్పోతారని అన్నారు. పనిగట్టుకుని మన పౌరులను చంపడం సరైనది కాదు. అది రాజ్యాంగానికి విరుద్ధం. తెలంగాణ బిడ్డలకు ఉద్యమాలతో అనుబంధం ఉంది. ప్రతి ఊరిలో జాతరలా ఉద్యమాలు జరిగాయి. భూములు, ఇండ్లు, తదితర పంచాయతీలను మావోయిస్టు పార్టీ పరిష్కరించింది. కానీ ఇప్పుడు మారిన పరిస్థితులకు అనుగుణంగా వారు ఆయుధాలు విడనాడాలి. శాంతియుత వాతావరణాన్ని కల్పించి, హింస లేకుండా చేసుకుంటే బాగుంటుంది. హింసకు హింస పరిష్కారం కాదు. బీజేపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మావోయిస్టులను చంపాలని చెప్పడం రాజ్యాంగానికి వ్యతిరేకం అన్నారు. వారేమీ టెర్రరిస్టులు కాదు... ఉగ్రవాదులు అంతకంటే కాదు. 50 ఏళ్ల నుంచి ఉద్యమంలో పని చేసిన వారు. వారి డిమాండ్లు అన్నీ న్యాయమైనవే. ఆదివాసులను ఇబ్బంది పెట్టకుండా చర్చలు జరపాలి. పోలీసులు, మావోయిస్టుల గొడవల్లో ఆదివాసీ బిడ్డలు... ముఖ్యంగా మహిళలు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

### రాష్ట్రపతి కూడా ఆదివాసీ బిడ్డే !

రాష్ట్రపతి కూడా ఆదివాసీ బిడ్డనే కాబట్టి దీనిపై ఆలోచించాలని సీతక్క కోరారు. ప్రజాసంఘాలు, మేధావులు, ఆదివాసీ సంఘాలు మాకు లేఖలు ఇస్తున్నారు. కాబట్టి అవన్నీ రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాలనుకుంటున్నామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం చర్చలకు అవకాశం ఇస్తే బాగుంటుందని అన్నారు. వారిని జనాల్లోకి తీసుకురావాలని కోరుతున్నారు. కేశవరావు, జానారెడ్డి సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటాం అని ఆమె చెప్పారు. ఆదివాసులకు అండగా నిలబడుతున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు సీతక్క. బీజేపీ శత్రు వైఖరి విడనాడి స్నేహపూరితమైన ధోరణి అనుసరించాలన్నారు. కర్రెగుట్టల నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగానికి లోబడి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఉగ్రవాదాన్ని ఎగదోస్తే..

# మీకు నూకలు చెల్లినట్లే



(మొదటి పేజీ తరువాయి)

దయాది దేశం పాకిస్థాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు– పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు– ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లినట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబుతామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి అని అన్నారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు– పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి అమరుడయ్యారు మహాత్ముడు. ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నాం. ఆయన శాంతి సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి.. మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే.. ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం అని రేవంత్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూని ర్యాలీగా ముందుకు సాగారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ ర్యాలీలో డిప్యూటీ– సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ విజయశాంతి, సచివాలయ ఉద్యోగులు, మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అంతకుముందు గురువారం సాయంత్రం ఈ సంఘీభావ ర్యాలీ సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం పహల్గాం మృతులకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్‌లోని పలువురు మంత్రులు ఘనంగా నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి.. వారి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు– మౌనం పాటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యగా బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందులోభాగంగా పాకిస్థాన్‌తోపాటు– పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మూకల స్థావరాలను నేలమట్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

# సుందరీమణులు సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలకు సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో అంగరంగ వైభవంగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి ప్రభుత్వం.. ఈ పోటీలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ పటంపై ప్రత్యేక స్థానం పొందుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. విదేశీ ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడం ద్వారా రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ దేశాల సుందరీమణులతో పాటు అంతర్జాతీయ మీడియా సైతం రానుండటంతో రాష్ట్ర రాజధాని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దింది. పటిష్ట భద్రత సహా అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి అయినట్లు అధికరావర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రతిష్టను పెంచేందుకు, పెట్టుబడుల ఆకర్షణకు అందాల పోటీలను వినియోగించుకోవాలని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే పలు దఫాలుగా సమీ క్షలు నిర్వహించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను సమీక్షించడంతో పాటు, కార్యక్రమా లు జరిగే ప్రదేశాలను కూడా సందర్శించారు. కంటెస్టెంట్లతోనూ ఒకసారి భేటీ అయ్యారు. పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు.

అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రకృతి, పర్యా వరణ పరంగా అన్ని హంగులు ఉన్నా, తెలంగాణ ఆ రంగంలో వెనుకబడిందని భావిస్తున్న ప్రభుత్వం.. ఇకపై 'తెలంగాణ జరూర్ ఆనా'(తప్పకుండా తెలంగాణ రండి) అనే నినాదాన్ని ప్రపంచవ్యాప్తం చేయా లని నిర్ణయించింది. తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పాటు పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తోంది.

### సర్వాంగ సుందరంగా నగరం

ఈ పోటీల్లో పాల్గొనడానికి దాదాపు 100 మందికి పైగా సుందరీమణులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. నిర్వహణ సంస్థ మిస్ వరల్డ్ లిమిటెడ్‌కు చెందిన 28 మంది ప్రతినిధులు, మరో 17 మంది సహాయకులు కూడా వచ్చేశారు. రానున్న రెండురోజుల్లో మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి వస్తారని నిర్వాహకులు తెలిపారు. అధికారులు నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా.. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విమానాశ్రయాల్లో కూడా ప్రపంచ సుందరి పోటీలకు వచ్చే వారికి ఆహ్వానం పలుకుతూ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయించింది. గత వారం రోజులుగా వస్తున్న అతిథులు అందరికీ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతున్న పర్యాటక శాఖ, వారి బసకు అవసరమైన ఏర్పాట్లను కూడా చేసింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రైడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

### అలరించిన రిహార్సల్స్

ప్రపంచ సుందరి పోటీల కోసం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం రిహార్సల్స్ ఉత్సాహంగా కొనసాగాయి. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న వివిధ దేశాల పోటీదారులు ఆకర్షణీయమైన ప్రస్తాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. తమ ప్రతిభకు తగిన కార్యక్రమాలను ఎంపిక చేసుకుని ప్రాక్టీస్ చేశారు. ఇక సమయాను కూలంగా స్టేజ్ ఎంట్రీలు, గ్రూప్ మూవ్‌మెంట్స్, లైటింగ్, మ్యూజిక్ సెట్ అప్ తదితర అంశాలను నిర్వాహకులు పరిశీలించారు. ప్రధాన కార్యక్రమానికి ముందస్తుగా ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలిస్తూ రిహార్సల్స్ పూర్తిచేశారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెలా ఖరు వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని పరిమిత సంఖ్యలో సామాన్యులకూ కల్పించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రిజిస్టర్ చేసుకున్న వారికి పోటీలు జరిగే ఒక్కో కేంద్రంలో వెయ్యి మంది చొప్పున మొత్తం 5 కేంద్రాల్లో 5వేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం



# ఆపరేషన్ సిందూర్ అద్భుతం

### ఆర్మీకి మంత్రి ఉత్తమ్ అభినందనలు



**సూర్యాపేట,, (క్రైమ్ మిర్రర్):** జమ్మూకశ్మీర్‌లో ఇటీవల భారత పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రమూకలు దాడులకు భారీత్ ప్రతీకారం తీర్చుకోవడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమర్థించారు. మాజీ సైనికుడిగా భారత్ సైన్యానికి మంత్రి ఉత్తమ్ శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భారత బలగాలపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు. భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడులు విజయవంతంగా పూర్తి చేసిందని అన్నారు. భారత సైన్యం సమర్థవంతంగా శత్రువుల మీద దాడి చేసి భారత సైన్య లక్ష్యాలను పూర్తి చేసి పాకిస్తాన్‌కి సరైన గుణపాఠం చెప్పిందని అన్నారు. గురువారంకోదాడ పట్టణంలో వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ- హాస్పిటల్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పట్టణంలో మెరుగైన వైద్యం సేవలు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవడంతో ర్యాలీ నిర్వహించాలని భారత సైన్యానికి సంఘీభావంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు.

# తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట

## అందాల పోటీల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు... ఆయా ప్రాంతాలను సందర్శించేలా కార్యక్రమాలు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అంతర్జాతీయ అతివల అందాల పోటీలతో తెలంగాణ టూరిజానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడికి వచ్చే వారంతా తెలంగాణ లోని ప్రధాన పర్యాకట కేంద్రాలను సందర్శించనుండంతో వాటి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియనుంది. ముఖ్యంగా గ్రామీణ పర్యాటకం వెలుగులోకి రానుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇందుకు అనుగుణంగా భారగా ఏర్పాట్లు చేసింది. ఆహుతును పర్యాటక ప్రాంతాలకు తీసుకుని వెళ్లేలా ఏర్పట్లు చేసింది. తెలంగాణ పర్యాటకం అంటే రాజధాని హైదరాబాద్ మాత్రమే. మిస్ వరల్డ్ ఈవెంట్ ల నిర్వహణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పర్యాటకంను ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అందివచ్చిన అద్భుత అవకాశంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలుపడంతో పాటు- తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచ పటంలో ప్రముఖంగా నిలిపే అవకాశం లభిస్తుంది. నాగార్జునసాగర్ బుద్ధవనం , బౌద్ధ థీమ్ పార్క్, బౌద్ధ సంస్కృతి , ఆధ్యాత్మికతకు ప్రత్యేకించిన ఆకర్షణ. ఇది బుద్ధుని విగ్రహాలు, స్తూపాలు, ధ్యాన మండపాలతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇక్కడి థీమ్ పార్క్ బుద్ధుని జీవితం, బోధలు, బౌద్ధ కళ, సంస్కృతిని సజీవంగా ప్రదర్శిస్తుంది. ఈ ప్రాజెక్టు పర్యాటక రంగాన్ని బలపరుస్తూ, సాంస్కృతిక మార్పిడి, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోంది.



ఆధ్యాత్మిక శాంతి, జ్ఞానోదయం కోసం ప్రయత్నిస్తున్నవారికి ఇది ఒక ఆదర్శ స్థలం. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న వేయి స్థంభాల గుడి, కాకతీయ రాజవంశం శిల్పకళా వైభవానికి నిదర్శనం. రుద్రదేవ మహారాజు 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ గుడి శివుడు, విష్ణువు సూర్యదేవుడికి అంకితమైంది. ప్రత్యేకమైన త్రికూటాకార నిర్మాణంతో, నక్షత్ర ఆకారపు వేదికపై నిలిచి ఉంది. గర్భగుడి చుట్టూ 1000కు పైగా సున్నితంగా చెక్కబడిన స్థంభాలు ఉన్నాయి. ప్రధాన ఆకర్షణ ఏకశిలా నంది విగ్రహం, ఇది శిల్పుల నైపుణ్యాన్ని చాటుతుంది. ఈ దేవాలయం తురుష్కుల దండయాత్రలో కొంత భాగం నాశనమై, 20వ శతాబ్దంలో పునరుద్ధరించబడింది. ప్రాచీన భారతీయ వాస్తుశిల్పం అద్భుతమైన నమూనాగా నిలిచింది.

కాకతీయ రాజవంశం వాస్తుశిల్ప వైభవానికి అద్భుతమైన నిదర్శనమే వరంగల్ కోట. 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ కోట కాకతీయుల రాజధానిగా, వ్యూహాత్మక స్థానంగా పనిచేసింది. 3 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భవ్యమైన ప్రాకారాలు, దీని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. కాకతీయ కళాతోరణం అనే సూక్ష్మశిల్పాలు కలిగిన తోరణం ఈ కోటకు ప్రత్యేక ఆకర్షణ. స్వయంభూ దేవాలయంలోని శివలింగం భక్తులకు పవిత్ర తీర్థస్థలం. కోటలోని ధాన్యాగారాలు, సరుకు గిడ్డంగులు ఆ కాలపు సంపదను తెలియ జేస్తున్నాయి. తెలంగాణ సంపన్న సాంస్కృతిక వారసత్వానికి ఈ కోట ఒక జీవంత ముద్ర. చారిత్రక ప్రాధాన్యత, శిల్ప సౌందర్యం కారణంగా ప్రతి ఒక్కరూ ఇక్కడికి తప్పక వెళ్లాల్సిన ప్రదేశంగా ఇది నిలిచింది. ములుగు జిల్లా పాలంపేట వద్ద ఉన్న రామప్ప గుడి, కాకతీయ సామ్రాజ్యం వాస్తు శిల్ప సంపదకు ప్రతీక. ఇది 13వ శతాబ్దంలో గణపతి దేవ మహారాజు పాలనలో నిర్మించబడింది. ఈ శివాలయానికి ప్రధాన శిల్పి రామప్ప పేరు మీదుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శిల్పాలు, సుందరమైన నృత్య ముద్రలు, పురాణ కథలను చిత్రించే శిల్పాకృతులు అద్భుతంగా ఉంటాయి. 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడిన ఈ దేవాలయం చుట్టూ సహజ సుందరమైన చెరువు, హరిత వనాలు ఉన్నాయి. పోచంపల్లి ప్రాంతంలో నేతన్న మేధస్సుతో తయారయ్యే పోచంపల్లి ఇక్కత్ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ నేతకళలో నూలు లేదా పట్టుదారాలను డైలో ముందుగా రంగు వేసి, సంక్లిష్టమైన జ్యామితీయ నమూనాలతో నేస్తారు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే.. 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలు ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, గ్రామీణ పర్యాటకంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు , పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించుకునేందుకు తద్వారా గ్రామీణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా వరంగల్ , హన్మకొండ , ములుగు, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను షోకేజ్ కు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈనెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, బుద్ధిష్ట థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నారు. అలాగే ఈ నెల 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్‌లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్టును సందర్శిస్తారు.

# బండి కార్యాలయానికి బెదరింపులు

### నాదర్‌గుల్ నుంచి కాల్ వచ్చినట్లు గుర్తింపు

### రంగంలోకి దిగి కెపి రావు అనే వ్యక్తి అరెస్ట్

**న్యూఢిల్లీ,, (క్రైమ్ మిర్రర్):** తాను చెప్పిన పని చేయాలని.. లేకుంటే మీ సంగతి చూస్తాంటూ ఓ అజా&ఝత వ్యక్తి న్యూఢిల్లీలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి గురువారం ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వెంటనే స్పందించింది. ఈ బెదిరింపులపై ఆయన కార్యాలయం.. హైదరాబాద్‌లోని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబుకు ఫోన్ చేసి వివరించింది. దాంతో సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు.. పోలీసులు రంగంలోకి దిగారు. ఆ క్రమంలో ఈ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి ఎక్కడి నుంచి ఫోన్ చేశాడంటూ.. సెల్ టవర్ల ఆధారంగా విచారణ చేపట్టారు.దీంతో ఆదిభట్ల పరిధిలోని నాదర్ గుల్ సమీపంలో జయసూర్యనగర్‌కు చెందిన కేపీ రావు.. ఈ ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో కేపీరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. ఆ తర్వాత అతడిని పోలీసులు విచారిస్తున్నారు. అయితే గతంలో సైతం కేపీ రావు.. లంచాల కోసం పలు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు- పలువురు రాజకీయ నాయకులకు ఈ తరహా ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడే వారని పోలీసుల విచారణలో గుర్తించారు.

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు- ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు- ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు- చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ- వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ-వర్ సెంటర్ ఏర్పాటు- చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజీనల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు- చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు- చేస్తున్నామన్నారు.

### చంద్రబాబు సెక్యూరిటీపై

# రాజీపడొద్దు

### పూర్తి స్థాయిలో సెక్యురిటీ ప్రొటోకాల్స్ అమలు

### సెక్యూరిటీ వింగ్‌తో పాటు..జిల్లా ఎస్పీలకు డిజిపి ఆదేశాలు

**అమరావతి,, (క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెక్యూరిటీ- విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ- వింగ్ ఉన్నతాధికారులను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. సెక్యురిటీ ప్రొటోకాల్స్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని.. ఎక్కడా రాజీ పడ వద్దని ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచన చేశారు. అలాగే జన సమూహంలోకి ముఖ్యమంత్రి వెళుతున్న సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని జిల్లాల ఎస్పీలను ఆయన ఆదేశించారు. ఆ తర్వాత ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి డీజీపీ హరీష్ కుమార్ తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తనదైన శైలిలో స్పందించారు. సామాన్య ప్రజలు, కార్యకర్తలకు ఎటు-వంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన మేర భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు సూచించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతీకార చర్యలకు భారత్ దిగిన సంగతి తెలిసిందే. అనంతరం వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ప్రజలు, సంస్థల రక్షణతోపాటు- వీఐపీల భద్రతపై గురువారం అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ప్రస్తుత పరిస్థితులతోపాటు- తదుపరి తీసుకోవాల్సిన భద్రత చర్యలపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అధ్యక్షతన కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశానికి ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హాతోపాటు-

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

**హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిందే**


**చెరువులను కబ్జా చేసిన వారిని వదిలి పెట్టేది లేదు**

**హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభంలో సిఎం రేవంత్**



**హైదరాబాద్,, (క్రైమ్ మిర్రర్):** హైడ్రా అంటే కొందరికి కడుపు మంట అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే హైడ్రాపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇళ్లు కూల్చడానికి కాదని.. ఆక్రణదారులను అడ్డుకోవడానికేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. చెరువులు కనుమరుగైతే మన మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు.. హైడ్రా ఉపయోగపడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో తొలి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులను ఆక్రమించిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరేమనుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం హైడ్రా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. వర్షం వస్తే చెన్నై, ముంబై మహానగరాల పరిస్థితి ఏంటో చూస్తున్నామని ఆయన సోదాహరణగా వివరించారు. కాలుష్యంతో ఢిల్లీ విలవిల్లాడుతోంది.. ఈ పరిస్థితికి మానవ తప్పిదాలే కారణమని ఆయన పేర్కొన్నారు. మంచి పరిపాలన అందించేందుకు గడిచిన 76 ఏళ్లలో.. రాజ్యాంగాన్ని 100 సార్లకుపైగా సవరించుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తు చేశారు. నగరాభివృద్ధి కోసం గత సీఎంలు ఎన్నో చట్టాలు చేశారన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు చూసి.. అప్పటి నిజాం నవాబు కన్నీరు సైతం పెట్టు-కున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనంతరం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే 122 హైడ్రా వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా తొమ్మిదిన్నర నెలల్లో ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారాలు.. హైడ్రా పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారన్నారు. వివిధ సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం ఏ ఉద్దేశ్యంతో హైడ్రాను ప్రారంభించారో.. అదే ఉద్దేశ్యంతో ఈ సంస్థ పని చేస్తుందని వివరించారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళ్తుందని చెప్పారు. అసెస్ట్ ప్రొటెక్షన్ మాత్రమే కాకుండా.. డిజాస్టర్ రెస్పాండ్స్ కూడా సరైన అధికారులతో హైడ్రా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానం కూడా పెద్ద ఎత్తులో వాడుతూ ఎఫ్‌టీ-ఎల్ పరిధి గుర్తిస్తున్నామన్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు- ద్వారా ల్యాండ్ గ్రేబింగ్, చీటింగ్, ఫోర్జరీ చేసే వారిపై చర్యలు తీసుకోనే అవకాశం దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హైడ్రా ఇలాగే ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి,

## ఎడిటోరియల్




# అదనుచూసి పదునైన పాఠం!

తీరికూర్చుని భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మలైన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్ లోనూ తొమ్మిది చోట్ల గంటసేపు సాగించిన క్షిపణి దాడులు పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి.

ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 70 మంది వరకూ ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని చెబు తున్నారు. ఉగ్రవాద ముఠాలైన జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. జేఈఎం చీఫ్ మసూర్ అజర్ సోదరితోసహా అతగాడి కుటుంబానికి చెందిన పదిమంది హతమయ్యారని కూడా చెబుతున్నారు. జరిగిన నష్టాన్ని కప్పెట్టే ఎత్తుగడతో అయిదు భారత్ విమానాలను కూల్చామంటూ పాక్ స్వోత్కర్షలకు పోతోంది. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోలోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదునైన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి. పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురుస్తోంది. దీనిపై నిలదీస్తే షరా మామూ లుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు. అనుకోని పరిణామాలు తలెత్తితే అనుసరించాల్సిన పద్ధతులపై పౌరులకు అవగాహన కల్పించటానికి బుధవారం మాక్ డ్రిల్ జరగటం, అంతకుముందు రోజు రాత్రే మన త్రివిధ దళాలు దాడులు చేయటం గమనిస్తే వర్తమానం ఎంత జటిలంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను రద్దుచేసుకుని వెను దిరిగారు. ఆ వెంటనే మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగించారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణ యించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగి పోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణ యాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించ టంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది. యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే నైజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంత ర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు. తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసు కుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది. ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్య వసరం.

**అకాల వర్షాలు మరోమారు తెలుగు రాష్ట్రాల రైతులను దెబ్బతీసాయి. పంటచేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో పంటలు నేలకొరిగాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు రాక..అప్పుల్లో కూరుకు పోతున్నారు. ఏలా ఇది జరుగుతున్న తంతే. వరి, బొప్పాయి, మామిడి, మక్కజొన్న తదితర పంటలు ఇలా దెబ్బతింటున్నాయి. అన్నదాతల పంటలసాగు జూదంలా మారింది. పంటలు దండిగా పండితే మద్దతు ధరలు ఇవ్వరు.**

పంటలు చేతికొస్తాయనుకుంటే వడగళ్లకు నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్ట పరిహారం కూడా ప్రహసనంగా మారింది. అధికారులు రావాలి..అంచనాలు వేయాలి...తరవాత అరకొ సాయం అందుతుంది. కొందరికి అదికూడా అందదు. ఇంతటి దౌర్భాగ్యంలో రైతులు ఉన్నా..ఊరడించే పాలకులు సకాలంలో సాయం చేసే చర్యలు తీసుకోరు. నిజానికి సమగ్ర పంటలబీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలి. ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్ట యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు,



# సమగ్ర పంటల బీమాపై ఆలోచన చేయండి !

ప్రీమియం ప్రభుత్వాలే కట్టుకుంటే..రైతులకు పంటనష్టపోయినప్పుడు నూటికనూరు శాతం నష్ట పరిహారం వచ్చేలా చేయాలి. అప్పుడు అన్నదాత నిశ్చితంగా పంటలు సాగుచేస్తారు. సమగ్ర పంటల బీమాతో రైతులను ఆదుకునేలా ప్రణాళికలను అత్యవసరంగా సిద్ధం చేయాల్సి ఉంది. మనిషికి, పశు వులకు, వాహనాలకు, ఇళ్లకు బీమా చేస్తున్న పద్ధతిలోనే పంటల బీమాకు కూడా ప్రణాళిక చేయాల్సి ఉంది. ఇకపోతే ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించి.. వారంతా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహిం చడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను పోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్ధిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాల వర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు, విలయం సంభవించి నప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్

బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయక పోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఎప్పుడు ఎలా చెల్లించాలో గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు దండోరా వేసి రైతుల దృష్టికి తీసుకుని రావాలి. బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది సీజన్‌కు ముందే కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్క జొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు కూడా బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి,పత్తి,శనగ తదితర రైతులు నష్టం సంభవించి నప్పుడు ఏ విధంగా పరిహారం పొందవచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామిక వేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి. అప్పుడే దేశంలో రైతులకు భరోసా దక్కుతుంది. దీనిని అత్యవసర విషయంగా గుర్తించి రాష్ట్రాలు కూడా ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్రంతో చర్చిస్తే మంచిది.

# ప్రాణంపోసే నిర్ణయం




అనునిత్యం నెత్తుటి చరిత్ర రచిస్తున్న రహదారులపై దుర్మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక మంచి ప్రయత్నం చేసింది. సోమవారం విడుదలైన ఒక నోటిఫికేషన్ ప్రకారం ఇకపై రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకున్నవారికి ఆస్పత్రుల్లో నగదురహిత చికిత్స వెనువెంటనే అందుతుంది. ప్రమాద బాధితులకు లక్షన్నర రూపాయల వరకూ చికిత్స సదుపాయం లభించటంతోపాటు వారం రోజుల వరకూ వైద్య సేవలు పొందే వెసులుబాటునిచ్చారు. దేశంలో ఏ రోడ్డుపై ప్రమాదం జరిగినా ఈ పథకం వర్తిస్తుందని నోటిఫికేషన్ చెబుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఏడాది పాలన పూర్తి చేసుకున్నాక 2015 జూలైలో 'మన్ కీ బాత్' కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను ప్రస్తావించారు. బాధితులకు చికిత్స చేయటంలో ఆస్పత్రులు వెనుకంజ వేయకుండా నగదురహిత వైద్యానికి వీలుకల్పిస్తామని ఆ సందర్భంలోనే చెప్పారు. అది ఇన్నాళ్లకు సాకారమైంది. ప్రమాదాల నియంత్రణకు కేంద్రం అనేక చర్యలు తీసుకుంటూనేవుంది. కానీ పెద్దగా ఫలితాన్నిస్తున్న జాడ కనబడదు. ఏటా వెల్లడయ్యే గణాంకాలే ఇందుకు సాక్ష్యం. కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మొన్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మాట్లాడుతూ ఏటా మన రహ దారులపై దాదాపు 4,80,000 ప్రమాదాలు సంభవిస్తున్నాయని, 1,78,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పినప్పుడు అందరూ దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాద మృతుల్లో 60 శాతం మంది 18%-%34 యేళ్ల మధ్య వయస్కులేనని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన మంత్రిత్వశాఖ నిస్సహాయతను కూడా వివరించారు. 2024 ఆఖరుకల్లా రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య 50 శాతం మేరకు తగ్గించాలని నిర్ణయించుకున్నా ఏమాత్రం సాధ్యపడలేదని, పైపెచ్చు అవి మరింత పెరిగాయని ఆయన ఒప్పుకున్నారు. ప్రమాదాల నివారణ మాట అటుంచి బాధితులకు సకాలంలో వైద్యసాయం అందితే చాలామందిని మృత్యుముఖం నుంచి బయటకు తీసుకురావొచ్చని నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తే చికిత్స ఆలస్యం కావటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ డబ్బు విదిలిస్తే తప్ప చికిత్సకు ముందుకురాని ఆస్ప త్రుల కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది గమనించే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందే వెసులుబాటు కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అదికాస్తా అటకెక్కింది. ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల బెడదపై నాలుగేళ్లక్రితం ఐక్యరాజ్యసమితి దృష్టి సారించింది. 2021%-%30 మధ్య ఈ ఉదంతాల్లో మరణాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని లక్ష్యనిర్దేశం చేసింది. ఆ మాటెలా వున్నా కేవలం పెను వేగంతో వెళ్లే వాహనాల వల్లనే ప్రమాదాలు చోటుచేసుకుంటా యన్నది నిజం కాదు. మొన్న మార్చిలో జరిగిన సదస్సులో కేంద్రమంత్రి గడ్కరీయే ఈ విషయాన్ని అంగీకరించారు.

ఇరుకురోడ్డని, మలుపు వున్నదని, వేగం తగ్గించాలని సూచించే బోర్డులూ, మార్కింగ్‌లూ అవసరమైనచోట్ల లేకపోవటం దగ్గర్నుంచి నిర్మాణపరంగా వుండే లోపాల వరకూ అనేకానేక మైనవి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సివిల్ ఇంజనీర్లు మొదలుకొని కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ల వరకూ ఎవరికీ దీనిపై జవాబుదారీతనం లేదు. సవివర ప్రణాళికా నివేదిక (డీపీఆర్)లు నాసిరకంగా వున్నా అడిగేవారు లేరు.

ఆధునిక సాంకేతికతలు అందుబాటులోకి రావటం వల్ల లోపాలను ముందు గానే సులభంగా పసిగట్టడం సాధ్యమవుతోంది. వాటిని అనుసరిద్దామన్న ఆలోచన కూడా రాదు. అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్న ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, స్పెయిన్ దేశాల్లో ఎలాంటి విధానాలు అనుసరిస్తున్నారో గమనించి, వాటిని అమల్లోకి తెచ్చినా ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

అసలు మన రోడ్ల నాణ్యతకూ, అమ్మే వాహనాలకూ సంబంధమే లేకుండా పోయింది. అమ్మ కాలు పెంచుకోవటం కోసం అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టి, బ్యాంకు లోన్ల సదుపాయం కల్పించి జనంలో వ్యామోహాన్ని పెంచటం రివాజైంది. ద్విచక్ర వాహనాలు సైతం వాయు వేగంతో పోయేలా డిజైన్ చేస్తుంటే...అవి నిండా ఇరవయ్యేళ్లు లేనివారి చేతికొస్తుంటే ప్రమాదాలు జరగటంలో వింతేముంది? రోడ్డు ప్రమాదాల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం చొరవ తీసుకుని అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది.

కేరళ, యూపీ, నాగాలాండ్ మినహా మరే రాష్ట్రమూ రహదారి భద్రతకు సంబంధించిన విధానమే రూపొందించుకోలేదని ఆ కమిటీ నివేదిక ఎత్తిచూపింది. డ్రైవింగ్ లైసె న్సుల జారీలో, భద్రతా నిబంధనల అమలులో ప్రభుత్వాలు అలసత్వాన్ని చూపుతున్నాయని చెప్పింది. ఇప్పటికైనా అన్ని రాష్ట్రాలూ ఈ లోపాలన్నిటినీ సరిదిద్దుకున్నాయో లేదో సందేహమే! తొలి గంటలో చికిత్స ప్రారంభిస్తే గాయపడినవారిలో కనీసం 50 శాతంమందికి ప్రాణాపాయం తప్పుతుందని వైద్య నిపుణులంటున్న మాట.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 9-5-2025


# కార్పొరేట్ స్థాయి వైద్యం కోదాడ కు అందుబాటులోకి తేవడం అభినందనీయం

## వైద్యశాలలు వ్యాపార దృక్పథంతో కాక సేవా దృక్పథంతో వ్యవహరించాలి

## పేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం అందించాలి

## మెరుగైన వైద్య సేవలు అందించి ఎస్వీఎస్ వైద్యశాల పేరు తెచ్చుకోవాలి..... మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**కోదాడ మే 08 (క్రైమ్ మిర్రర్):** నగరాలకే పరిమితమైన కార్పొరేట్ స్థాయి వైద్యం కోదాడ కు అందుబాటులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని హుజూర్నగర్ రోడ్ లో ఫ్లై ఓవర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోదాడ హుజూర్నగర్ ప్రాంత ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు పూర్తి వ్యాపార దృక్పథంతో కాకుండా వైద్యులు సేవా దృక్పథంతో పేద మధ్యతరగతి ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజలకు విద్య వైద్యం అత్యంత ఆవశ్యకమని కోదాడలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ప్రశంసనీయమన్నారు. అభివృద్ధికి చెందిన అంశాలపై తన వంతు సహకారం అన్నివేళలా ఉంటుందన్నారు. వైద్యశాలలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్న వైద్య సేవల వివరాలను నిర్వాహకులు డాక్టర్ శివప్రసాద్ రావూరు మంత్రికి వివరించారు. అనంతరం డాక్టర్ శివప్రసాద్ రావూరు మాట్లాడుతూ వైద్యశాలలో హైదరాబాద్ వంటి నగరాలకు దీటుగా గుండె ఊపిరితిత్తులు మెదడు నరాలు మూత్రపిండా వ్యాధులు క్రిటికల్ కేర్ ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు ప్రతి విభాగానికి అనుభవాజ్ఞులైన



వైద్యులు వైద్య పరికరాలు వ్యాధి పరిశోధక యంత్రాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వైద్యశాల అన్నివేళలా అందుబాటులో ఉంటుందన్నారు అనంతరం వైద్యశాల యాజమాన్యం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించింది ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రావూరు శివప్రసాద్, డాక్టర్ నరేందర్ ఎస్ వి ఎస్ హాస్పిటల్ వైద్యుల బృందం, కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, కోదాడ హుజూర్నగర్ ఐఎంఏ వైద్యులు కోదాడ హుజూర్నగర్ పట్టణాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ప్రభాకర్ రెడ్డికి లేదు : కుంభం శ్రీనివాస్ రెడ్డి

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రాజగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో ఆధునీకరణ చేశారు

## ఆదర్శ నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యం.. డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి





మునుగోడు క్రైమ్ మిర్రర్ : ప్రజా సమస్యలు చర్చించడానికి వేదిక అయిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో ఆధునీకరించారని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మునుగోడు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...కోటి 60 లక్షల వ్యయంతో నాణ్యంగా నిర్మించాల్సిన అధికారిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కమిషన్ లకు ఆశపడి నాసిరకంగా నిర్మించారని , ప్రజా సమస్యలు చర్చించే వేదిక ఇలా వుండోదని ,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో ఆధునికరిస్తే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నాడని మండిపడ్డారు.నిజమయిన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పనిచేస్తున్నారని గుర్తుకు తెచ్చారు.మునుగోడును ఆదర్శ నియోజకవర్గంగా మార్చడానికి అనునిత్యం కష్టపడుతున్న వ్యక్తి రాజగోపాల్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు మీకు లేదన్నారు..మరోసారి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.. చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, కుంభం చెన్నారెడ్డి,ఎండి హైమద్, మిరియాల వెంకటేశ్వర్లు, నకిరేకంటి యాదయ్య,మాధగోని రాజేష్ గౌడ్,వట్టికోటి శేఖర్, జనీగల ముత్యాలు,మందుల బీరప్ప,ఆరెళ్ల సైదులు,పందుల భాస్కర్,ముచ్చపోతుల శీను,జంగిలి నాగరాజు,వరికుప్పల వెంకన్న, పాల్గొన్నారు..

# జలమండలి అధికారులు నీటి వ్యాపారం చేస్తున్నారు

## మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

గండిపేట్(క్రైం మిర్రర్): జలమండలి అధికారులు నీటి వ్యాపారం కొనసాగిస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు గురువారం పుప్పాలగూడలోని బయాత్ కాలనీ పరిసర ప్రాంత ప్రజలను కలుసుకోని స్థానిక సమస్యల సేకరణ చేపట్టారు. జలమండలి లైన్‌మెన్‌లు ఇష్టారాజ్యాంగా మంచినీటి సరపరా వేళాపాలా లేకుండా చేస్తూ అడిగితే పై నుంచి నీరు సరిగ్గా రావడం లేదని తెలుపుతూ అధికారులేమో ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి నీటి అమ్మకానికి ట్యాంకర్లు సరఫరా గావిస్తూ వ్యాపారం చేస్తున్నారన్నారు. వేసవి మూలంగా బోరింగులలో నీటి మట్టం లేనందు వల్ల గత్యంతరం లేని పరిస్థితిలో ప్రైవేటు ట్యాంకర్ల యజమానులు ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నారని అల్లాడిపోతున్నారన్నారు. ఖాళీ స్థలం ప్లాటులతో పాటు వీధులన్నీ కుప్పి తోట్టి




మాదిగి చెత్తా చెదారంతో ఉండడం, ప్రక్కనే పారుతున్న పందెంవాగు దుర్వాసన భరించ లేకుండా ఉంటుందనీ, దోమల బెడద తీవ్రంగా ఎదుర్కొంటున్నామని, పందెం వాగు నాలాపై కొంత మేర డోమ్ రూపంలో సిమెంట్ కట్టడం జరిగిందనీ విస్తుపోతు తరతమ భేదం లేకుండా అందరికీ సమన్యాయం చేస్తూ పందెంవాగు నాలాపై డోమ్ కట్టం చేసినట్లయితే ప్రజలకు ఎంతో కొంత మేలు చేసిన వారవుతారన్నారు. దురాస్వన నుంచి విముక్తిపొంది దోమల బెడద పాలు కాకుండా ఆరోగ్యాలను కాపాడాలనీ కోరారు. ఇక్కడ మొత్తంగా



విద్యుత్ సరఫరా సరిగ్గా లేదని పై పెచ్చు వీధి దీపాలు అసలు వెలగడం లేవని చిమ్మ చీకటిలో పిల్లలు పెద్దలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి సాధ్యమైనంత త్వరగా ప్రజా సౌకర్యార్థం ఉపశమనం కలిగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్‌రావు, ఏర్పుల శ్రీకాంత్, సంఘం శ్రీకాంత్, భానుచందర్, బొడ్డు శ్రీధర్, సుమనళిని, రమణమూర్తి, బాబురావు తదితరులున్నారు.

# అనంతగిరి మండల సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఎర్రసాని రవి ఎన్నిక

**కోదాడ మే 08 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: అనంతగిరి మండలం సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఎర్రసాని రవి ని అనంతగిరి మండల మహాసభలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు రవి గతంలో ఏఐటీయూసీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా గత మూడు సంవత్సరాలు పనిచేశారు ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అనంతగిరి మండలంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి నాయకులను కార్యకర్తలను కలుపుకొని కృషి చేస్తానని తెలిపారు




# రాజేంద్రనగర్ ప్రభుత్వం ఆరోగ్య కేంద్రంలో సి వై - టీబీ పరీక్షలు ప్రారంభం...



గండిపేట్(క్రైం మిర్రర్):టీబీ (క్షయరోగం)ను దశలవారీగా నిర్మూలించేందుకు ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా, సి వై - టీబీ అనే సరికొత్త పరీక్షను రాజేంద్రనగర్ ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. రాజు, ఎస్.టీ.ఎస్ నరేష్ కుమార్, ఎస్.టీ.ఎల్.ఎస్ రహీం పాల్గొన్నారు. సి వై - టీబీ పరీక్ష ద్వారా టీబీ బాక్టీరియా శరీరంలో లోపల దాగి ఉందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇది ప్రధానంగా టీబీ రోగుల కుటుంబ సభ్యులు, షుగర్ ఉన్నవారు, బీడి, సిగరెట్, మద్యం వాడేవారికి నిర్వహిస్తున్నారు. వీరిని కాంటాక్ట్స్ గా పరిగణిస్తారు. ఈ పరీక్ష చేసిన 48 గంటల్లో ఫలితాలు వచ్చి, లోపల దాగి ఉన్న టీబీ ఉందని గుర్తిస్తే, వెంటనే ఐ.ఎన్.హెచ్. రిఫ్‌ప్రెవెంటివ్ థెరపీ ద్వారా చికిత్స ప్రారం భిస్తారు. దీని వల్ల టీబీ వచ్చే అవకాశం తొలగిపోతుంది. స్టాఫ్ నర్స్‌లపై కూడా పరీక్షలు నిర్వహించి, వారు ఆరోగ్యంగా ఉన్నారా అనే అంశాన్ని గుర్తిస్తున్నారు. సి వై - టీబీ ద్వారా ముందుగానే రోగాన్ని గుర్తించడం వల్ల, భారత్‌ను టీబీ రహిత దేశంగా మార్చే లక్ష్యానికి దోహదపడనుందన్నారు.

# ప్రజల సౌకర్యార్థం బస్టాప్‌ల నిర్వహణ చేపట్టాలి

గండిపేట్(క్రైం మిర్రర్): ప్రజల సౌకర్యార్థం బస్టాప్‌ల నిర్వహణను చేపట్టాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు కోరుతున్నారు. బస్టాప్‌ల సౌకర్యాం సరిగ్గా లేక ప్రజలు రోడ్లపైనే ప్రమాదభరితంగా నిలపడి ఉంటున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటూ అనేక మంది గాయాలకు గురవుతున్నారు. ఎండనక, వాననక రోడ్లపై నిలపడుతూ తమ ప్రాణాలను కుప్పిట్లో పెట్టుకోని ఉంటున్నారు. కిస్మత్‌పూర్ ప్రధాన రహదారిపై వస్టాప్ వచ్చిపోయే వాళ్లకు కూడా ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుంది. బస్సుల్లో వెళ్లే వారికి బస్‌స్టాప్ లేకుండా సౌకర్యం లేకుండా అయిపోయిందని వెల్లడిస్తున్నారు. ఇది తొందరగా పరిష్కరించాలని కోరుతున్నారు.



# సహాయం చేయాలని వెళ్లి మృత్యువాత




## టైర్ మార్చడానికి వెళితే మరో కారు ఢీకోట్టింది

### ఔటర్ ఎగ్జిట్ పాయింట్ వద్ద విషాద ఘటన

గండిపేట్(క్రైం మిర్రర్): ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తున్న వాహనం ఆగిపోవడంతో అతడికి సహాయం చేసేందుకు వచ్చిన డ్రైవర్‌ను అతివేగంగా వచ్చిన టయోటో కారు ఢీకోట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఔటర్ రింగ్ రోడు మీదుగా శంషాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు డ్రైవర్ నిద్రమత్తులో మీడియన్‌కు తగిలి బ్రేక్ డౌన్ అయింది. అది గమనించి సహాయం చేయడానికి ఆగిన మరోక కారు ఇంతలో శంషాబాద్ వైపు నుంచి టీజీపీఏ వైపు వెళ్తున్న రికవరీ వ్యాన్ డ్రైవర్ శివకేశవ రోడ్డు దాటి వచ్చి బ్రేక్ డౌన్ అయిన కారు టైర్లు మారుస్తున్నాడు. మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన టయోటో కారు ఢీకోట్టింది. రికవరీ వ్యాన్ డ్రైవర్ శివకేశవ అక్కడికక్కడే మృతి చెందగా మరోకరికి తీవ్ర గాయాలైయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**అప్రమత్తత, జాగ్రత్త ఎంతో అవసరం...**

ప్రయాణానికి బయలుదేరే ముందు వెహికిల్ కండిషన్, ఫ్యూయల్ చెక్ చేసుకోవాలన్నారు. వెహికిల్ అత్యవసరంగా ఆపే పరిస్థితి వస్తే ఎమర్జెన్సీ పార్కింగ్‌లోనే ఆపాలన్నారు. ఓఆర్ఆర్‌పై వెహికిల్ బ్రేక్ డౌన్ అయితే వెంటనే ఎమర్జెన్సీ పార్కింగ్ ఇండికేటర్స్ ఏర్పాటు చేయాలి. వెంటనే ఓఆర్ఆర్ ఎమర్జెన్సీ నెంబర్ 14449కి ఫోన్ చేయాలన్నారు. ఓఆర్ఆర్‌పైన ఉన్న ఎస్‌వోఎస్ సిస్టమ్ ద్వారా అత్యవసరంగా ఉన్న పరిస్థితి తెలియజేయాలన్నారు. లేదా 100 ద్వారా పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఫ్లై ఓవర్‌పై వెళ్తున్నప్పుడు వెహికిల్స్ బ్రేక్ డౌన్ అయితే వెంటనే ఎమర్జెనీ ఇండికేటర్ వేయాలన్నారు. వెహికిల్ బ్రేక్ డౌన్ అయితే నోటీస్ చేసిన వ్యక్తుదలు సహాయం చేయడానికి వెళ్లకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎందుకంటే వెహికిల్ మూవ్‌మెంట్ స్పీడ్ ఉంటుంది సరైన జాగ్రత్తలు తీసుకోని మాత్రమే వెహికిల్ రిపేర్ లేదా వెహికిల్ టోనింగ్ చేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు.



## మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డిని కలిసిన నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కె.విష్ణువర్ధన్‌రెడ్డి

గండిపేట్(క్రైం మిర్రర్): మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డిపై ఉన్న తప్పుడు కేసులో సీబీఐ కోర్టు నిర్ధోశిగా ప్రకటించడం హర్షనీయమని నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కె.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రిగా పని చేసిన సబితాఇంద్రారెడ్డిపై వచ్చిన ఆరోపణలన్నీ కూడా కోర్టు కట్టివేయడంతో ఆమె కడిగిన ముత్యంలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్, మల్లేష్, శేఖర్‌రెడ్డి, మహేష్ తదితరులున్నారు.

## చిరందాస్ ధనుంజయ్ కు ఘన సన్మానం

**శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి**



**చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్:** భారతీయ చలనచిత్ర ప్రముఖ దర్శకుడు కీర్తిశేషులు దాదాసాహెబ్ ఆర్కే మెమోరియల్ అవార్డు అందుకున్న చౌటుప్పల్ పుర ప్రముఖుడు నల్గొండ జిల్లా కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిరందాస్ ధనుంజయ్ అవార్డు అందుకున్న సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామచంద్ర స్వామి దేవాలయం చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది బాల్యం వెంకటాచలం, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ధర్మకర్త గుర్రం వెంకటేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ధనుంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ బాపు కొండా లక్ష్మణ్ బాపూజీ వారు జీవిత కాలంలో బడుగు బలహీన వర్గాలకు, మన ప్రాంత ప్రజలకు చేసిన సేవలు అదేవిధంగా తెలంగాణ మొదటి నుండి ఉద్యమానికి జీవం పోసిన కొండ లక్ష్మణ్ జీవితానికి సంబంధించిన డాక్యుమెంటరీ చిత్రం నిర్మించినందుకు తన జన్మ ధన్యమైందని తెలియజేశారు. త్వరలో పోచంపల్లి డిజైన్ల విషయంలో నైపుణ్యతను కలిగి ఆర్థికంగా లేక ఎంతోమంది నేత కార్మికులు మరుగున పడుతున్నారన్నారు. పోచంపల్లి చేనేతలపై డాక్యుమెంటరీ చిత్రానికి ప్రయత్నం చేస్తున్నాం అని తెలియజేశారు.

## కడపలో మహానాడుకు చురుకుగా ఏర్పాట్లు

**పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి వెల్లడి**

కడప: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు- నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్తు అనే విధంగా నిర్వహిస్తామని కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వచ్చే అతిథుల కోసం వసతి ఏర్పాట్లు- పూర్తి చేసినట్లు- ఆయన తెలిపారు. గురువారం కడపలో శ్రీనివాసులు రెడ్డి విలేకరలతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి తొలి రోజు 40 వేల మంది అతిథులు హాజరవుతు న్నారన్నారు. 12 జిల్లాల నుంచి వచ్చే వారి కోసం వసతి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ జిల్లాలో తొలిసారి పసుపు పండుగ మహానాడు జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం కమిటీ-లు వేసి వాటి ద్వారా మహానాడును విజయవంతం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా ఏర్పాట్లు- చేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులను కలుపుకుని ఈ మహానాడును విజయవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నుంచి పూర్తి స్థాయి పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని లాడ్జిలు, కళ్యాణ మండపాలుతోపాటు- స్కూళ్లు అన్నింటిలో వసతి ఏర్పాట్లు- చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 9063596644 ఏర్పాటు- చేసినట్లు- ఆయన వివరించారు. మహానాడు ముగింపు రోజు.. అంటే మూడవ రోజు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## అంకిత భావంతో పనిచేసే ఉద్యోగికి సమాజంలో గుర్తింపు

**సమాజానికి మనమేమిస్తామని నినాదంతో ఏర్పడిందే ఆస్క్: లక్ష్మీనారాయణ రెడ్డి**




**కోదాడ మే 08 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: ప్రభుత్వ ఉద్యోగి తన వృత్తిలో అంకిత భావంతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, డిసిసిబి మాజీ అధ్యక్షులు ముత్తవరపు పాండురంగారావు, విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర నాయకులు రావేళ్ళ సీతారామయ్య లు అన్నాడు అంబేద్కర్ ఆశయసాధన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బల్గూరి దుర్గయ్య ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య లు ఆధ్వర్యంలోగురువారం.పట్టణంలోని స్థానిక ఎమ్మెస్ కళాశాల ఆవరణలో మాతంగి ప్రభాకర్ రావు ఉద్యోగ విరమణ అభినందన సభను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదాడ బార అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, డిసిసిబి మాజీ అధ్యక్షులు ముత్తవరపు పాండురంగారావు రావిళ్ళ సీతారామయ్య, మండల సహకార కళాశాలల విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, విశ్రాంతి ఉద్యోగుల జిల్లా నాయకులు బొల్లురాంబాబు లు పాల్గొనిమాట్లాడుతూ మాతంగి ప్రభాకర్ రావు తన వృత్తికి వన్నెతెచ్చారని కొనియాడారు.తను పనిచేసిన పాఠశాలలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు.అలాగే అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం కుఎనలేని కృషిచేసి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేశారని కొనియాడారు ప్రభాకర్ రావు ముందు ముందు ఎన్నో సమాజసేవలు చేసి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొని శేష జీవితాన్ని గడపాలని తెలిపారు ఈ కార్యక్రమములో మాజీ వార్డ్ కౌన్సిలర్లు సామినేని నరేష్, కర్రీ శివ సుబ్బారావు, బొల్లు ప్రసాదు ఆస్క్ సభ్యులు, అస్క్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## ఆదివాసీ యువతికి ఓయూ నుంచి డాక్టరేట్

భద్రాచలం టౌన్: భద్రాచలానికి చెందిన ఈసం జ్యోతిర్మయికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. భౌతిక శాస్త్రంలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గురువారం డాక్టరేట్ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె అనురాధ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పీహెచ్‌డీ (ఆర్ట్స్) పూర్తి చేసిన మొదటి ఆదివాసీ మహిళ కాగా, భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ సాధించిన ఆదివాసీగా జ్యోతిర్మయి రికార్డు సృష్టించారు. ఆమె తండ్రి అనంతయ్య భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



## ఎంఎల్ శిక్షణ ద్వారా తెంగాణ యువతను సాధికారంగా మారుస్తున్న స్కిల్ ఇండియా మిషన్


గండిపేట్(క్రైం మిర్రర్): ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఆధ్వర్యంలో, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) 4.0 పథకం సమన్వయంతో హైదరాబాద్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ), తెలంగాణలోని నిరుద్యోగ యువత కోసం ఏఐ%-%మెషిన్ లెర్నింగ్‌లో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ సమగ్రమైన శిక్షణ కార్యక్రమం ఈఎస్‌సీఐ ఆధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన క్యాంపస్‌లో నిర్వహించబడుతుంది. ఇది స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా అభ్యర్థులను కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ రంగాలలో పరిశ్రమకు అనుగుణమైన జ్ఞానం, నైపుణ్యాలలో సిద్ధం చేయడమే లక్ష్యంగా ఉందన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఈఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు, ఎంజీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ టి.వి.రాజనీకాంత్, మేనేజింగ్ డైరెక్టర్ శ్యామ్ సాగర్‌కుమార్, ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్లు రాజేష్ పర్షద్‌లు పాల్గొన్నారు డాక్టర్ జి.రామేశ్వర్‌రావు మాట్లాడుతూ వేగంగా పెరుగుతున్న ప్రాధాన్యతను, భవిష్యత్‌కు సిద్ధంగా ఉండే శ్రామికశక్తిని సృష్టించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ శిక్షణా అవకాశాన్ని శిక్షణార్థులు సంపూర్ణంగా ఉపయోగించుకోని డిజిట్ ఆర్థిక వ్యవస్థలో ఆవిష్కర్తలు, సమస్య పరిష్కారకులుగా ఎదగాలని ఆయన అన్నారు. ఈఎస్‌సీఐ చేపడుతున్న కార్యక్రమాలు, దాని మాతృసంస్థ అయిన ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా గూర్చి కూడా ఆయన సంక్లిప్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా స్కిల్ ఇండియా టిషర్ట్‌ను నమోదు అయిన అభ్యర్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైజాక్ మాస్టర్‌మైండ్ అబ్దుల్ రవూఫ్ అజహర్ హతం..!

ఆపరేషన్ సిందూర్‌లో భారత్ చిరకాల ప్రతీకారం కూడా తీరింది. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్‌కు మాస్టర్‌మైండ్, జైషే ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అజహర్ కూడా హతమయ్యాడు. బహావల్‌పుర్‌లోని మర్కజ్ సుబాన్ కాంప్లెక్స్‌పై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు కలిపి 14 మంది మరణించారు. వీరిలో రవూఫ్ అజహర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో అజహర్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, అతడి భార్య సహా పలువురు మృతి చెందినట్లు చెబుతున్నారు. రవూఫ్ అజహర్ పలు ఉగ్రదాడుల్లో నిందితుడు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో ఇతడు కూడా ఉన్నాడు. 2002లో ఉగ్రవాదంపై రీసెర్చ్ చేస్తున్న పెర్ల్ కొంత మంది మతపెద్దలను కలిసేందుకు పాక్‌లోని కరాచీకి వెళ్లాడు. కాందహార్ హైజాక్ సందర్భంగా ఉగ్రవాదులు విడిపించిన ఒమర్ షేక్ ఓ హోటల్ నుంచి పెర్ల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. 1999లో జరిగిన ఐసీ814 విమాన హైజాక్‌లో కూడా రవూఫ్ అజహర్ హస్తం ఉంది. ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్‌కు చేర్చారు. అక్కడి నుంచి భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. భారత జైళ్లలో ఉన్న మసూద్ అజహర్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్ అనే ఉగ్రవాదులను విడిపించుకొని తీసుకెళ్లారు. ఆ తర్వాతే మసూద్ అజహర్ జైషే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. ఇక 2001లో జరిగిన పార్లమెంట్‌పై దాడి, 2016లో పఠాన్ కోట్ దాడి, 2019లో పుల్వామా బాంబింగ్ వంటి ఉగ్ర ఘటనల్లో రవూఫ్ ప్రమేయం ఉంది. ప్రస్తుతం జైషే మొహమ్మద్ కీలక కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత..

ప్రమత్తమయ్యాయి. సరిహద్దు జిల్లాల్లో ఇప్పటికే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యాసంస్థలు మూసివేశారు. పోలీసు సిబ్బంది, ఇతర అధికారుల సెలవులను రద్దు చేశారు. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌తో సహా పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాలు చర్యలకు ఉపక్రమించాయి. పంజాబ్ ప్రభుత్వం అక్కడి పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. సరిహద్దులోని ఆరు జిల్లాల పరిధిలో స్కూళ్లు మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఫెరోజ్‌పుర్, పఠాన్‌కోట్, ఫజిల్కా, అమృత్‌సర్, గుర్దాస్‌పుర్, తర్న్ తరన్ జిల్లాల్లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అన్ని పాఠశాలలు మూసివేయనున్నట్లు తెలిపింది. దీంతో పాటు చండీగఢ్ సహా అనేక జిల్లాల్లో కరెంటు నిలిపివేశారు. ఉద్రిక్తతల వేళ అప్రమత్తంగా ఉన్నామని పంజాబ్ మంత్రి ఆమన్ ఆరోరా వెల్లడించారు.

హరియాణాలోనూ పోలీసు సిబ్బంది సహా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఉండాలని అన్ని జిల్లాల సివిల్ సర్జన్లకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కేంద్రాన్ని వీడి వెళ్లవద్దని స్పష్టం చేశారు.

ఢిల్లీ ప్రభుత్వం కూడా ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అత్యవసర పరిస్థితులు నెలకొనే అవకాశమున్న వేళ.. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఏ అధికారికీ సెలవులు ఇవ్వద్దని స్పష్టం చేసింది. ఎమర్జెన్సీ పరిస్థితులు ఏర్పడితే సంసిద్ధత కోసం ఆయా విభాగాల అధికారులతో సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

పంజాబ్ సరిహద్దు కలిగిన హిమాచల్ ప్రదేశ్‌లోనూ హై అలర్ట్ ప్రకటించారు. హమీర్‌పుర్, ఉనా, బిలాస్‌పుర్ సహా సరిహద్దు జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బాబా బాలక్‌నాథ్, మాతా చింత్‌పుర్ణీ, మాతా నైనా దేవీ వంటి ప్రముఖ ఆలయాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు.

రాజస్థాన్ ప్రభుత్వం కూడా పోలీసుల, ఇతర శాఖల ఉద్యోగుల సెలవులను రద్దు చేసింది. ఐదు సరిహద్దు జిల్లాల్లోని స్కూళ్లను కూడా మూసివేసింది. పశ్చిమ రాజస్థాన్‌లోని సరిహద్దు జిల్లాల్లో కరెంటు సరఫరా నిలిపివేసింది. బార్మర్, జైసల్మేర్, జోధ్‌పుర్ సహా పలు జిల్లాల్లో రాత్రి 9 నుంచి ఉదయం వరకు బ్లాక్‌అవుట్ అమలు చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో లైట్లను ఆపేయాలని గంగానగర్ పోలీసులు సూచించారు. మే 10వ తేదీ వరకు బికనెర్, అజ్మీర్‌లోని కిషన్‌గఢ్, జోధ్‌పుర్ ఎయిర్‌పోర్టుల్లో విమాన సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

గుజరాత్ తీర ప్రాంతంలోనూ భద్రత కట్టుదిట్టం చేశారు. పోలీసు సిబ్బంది సెలవులు రద్దు చేయడంతోపాటు.. సెలవుల్లో ఉన్నవారిని తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించారు. గుజరాత్‌కు భూ, సముద్ర సరిహద్దు ఉంది. రాజ్‌కోట్ రేంజ్, జామ్‌నగర్, మోర్బీ, దేవ్‌భూమి, ద్వారక జిల్లాలకు తీర ప్రాంతం ఉంది. గ్రామాల్లో పోలీసు గస్తీ పెంచిన అధికారులు.. ఏమైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే తెలియజేయాలని గ్రామప్రజలు, సర్పంచ్‌లకు సూచించారు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే సెలవులో ఉన్నవారు వెంటనే తిరిగి విధుల్లో చేరాలని ఆదేశించింది.

# యుద్ధం మొదలు



(మొదటి పేజీ తరువాయి)

బుధవారం అర్ధరాత్రి దాటినప్పటి నుంచీ భారత్‌పై ఎడాపెడా వైమానిక దాడులకు దిగింది. క్షిపణులు, డ్రోన్ దాడులతో సరిహద్దు రాష్ట్రాల్లో పలు పౌర, సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేసింది. వాటన్నింటినీ మన సైన్యం పూర్తిగా తిప్పికొట్టడమే గాక మూడు పాక్ యుద్ధ విమానాలను కూల్చేసింది. ఇద్దరు పాక్ పైలట్లను బందీలుగా పట్టుకుంది. రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు కీలక పాక్ నగరాలపై ఒకే రోజు రెండుసార్లు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. అక్కడి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తదితరాలను నేలమట్టం చేసింది. రెండు రోజుల వ్యవధిలో దాయాదికి వరుసగా రెండో పరాభవం రుచిచూపి మర్చిపోలేని గుణపాఠం నేర్పింది.

మరోవైపు నౌకాదళం కూడా రంగంలోకి దిగింది. పాక్‌కు జీవనాడి వంటి కరాచీ నౌకాశ్రయంపై ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక బాంబుల వర్షం కురిపించి 10కి పైగా నౌకలను ధ్వంసం చేసినట్టు సమాచారం. 1971 పాక్ యుద్ధం తర్వాత కరాచీ నౌకాశ్రయంపై దాడి ఇదే తొలిసారి. అంతేగాక ఏకంగా 20కి పైగా భారత యుద్ధ నౌకలు పాక్ వైపు కదులుతున్నట్టు చెబుతున్నారు. ఎల్లలు దాటిన ఉద్రిక్తతల నడుమ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధం దిశగా సాగుతున్నాయి. ఇరువైపుల నుంచీ కాల్పుల మోతతో సరిహద్దులు దద్దరిల్లిపోతున్నాయి. పౌర లక్ష్యాలపై పాక్ సైన్యం విచక్షణారహిత కాల్పులకు తెగబడుతోంది. అందుకు మన సైన్యం దీటుగా బదులిస్తోంది. ఇరు దేశాల్లోనూ సరిహద్దు రాష్ట్రాలు ఎయిర్ సైరన్లు, బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. పలు విమానాశ్రయాలు మూతబడ్డాయి. ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయి. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా భద్రతా బలగాలను కేంద్రం ఆదేశించింది. సైనికులకు సెలవులు రద్దు చేశారు.

కీలకమైన సైనిక తదితర మౌలిక వ్యవస్థల వద్ద రక్షణను కట్టుదిట్టం చేశారు. పాక్ అత్యంత అనాగరికంగా వ్యవహరిస్తోందంటూ కేంద్రం మండిపడింది. పౌర ఆవాసాలపై విచక్షణారహితంగా డ్రోన్లు, మిసైళ్లు ప్రయోగిస్తూ హమాస్ ఉగ్ర సంస్థను తలపిస్తోందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు దుయ్యబట్టాయి. జమ్మూ, పఠాన్‌కోట్, ఉద్ధంపూర్‌ల్లో పాక్ క్షిపణి, డ్రోన్ దాడి యత్నాలను పూర్తిగా తిప్పికొట్టినట్టు సైన్యం ప్రకటించింది. పరిస్థితి అదుపు తప్పుతున్న నేపథ్యంలో అమెరికా రంగంలోకి దిగింది. సంయమనం పాటించాల్సిందిగా ఇరు దేశాలకూ సూచించింది.

### పేట్రేగిన పాక్

సరిహద్దుల వెంబడి 15 సైనిక స్థావరాలపై దాడి యత్నాలు విఫలం కావడంతో గురువారం పాక్ మరింతగా పేట్రేగిపోయింది. రాత్రివేళ పాక్ ఫైటర్ జెట్లు భారత్‌పై తీవ్రస్థాయిలో దాడులకు తెరతీశాయి. రాజస్తాన్ మొదలుకుని జమ్మూ కశ్మీర్ దాకా సరిహద్దుల పొడవునా పలుచోట్ల సైనిక లక్ష్యాలతో పాటు విచక్షణారహితంగా పౌర ఆవాసాలపైనా గురిపెట్టాయి. శ్రీనగర్, జమ్మూ విమానాశ్రయాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేశాయి.


జమ్మూ%-%శ్రీనగర్ హైవేపై భారీ పేలుడు చోటుచేసుకుంది. రాజౌరీ జిల్లాలో పలుచోట్ల పేలుళ్లు విన్పించాయి. పాక్ దాడులన్నింటినీ సైన్యం సమర్థంగా అడ్డుకుంది. సత్వారీలోని జమ్మూ విమానాశ్రయం, సాంబా, ఆర్ఎస్ పుర, అర్నియా తదితర ప్రాంతాలపైకి కనీసం 8కి పైగా క్షిపణులు దూసుకొచ్చే ప్రయత్నం చేయగా మధ్యలోని అడ్డుకుని కూల్చేసినట్టు ప్రకటించింది.

మన 'ఆకాశ్', ఎంఆర్ఎస్ఏఎంతో పాటు అత్యాధునిక ఎస్%-%400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పాక్ క్షిపణులు, డ్రోన్లను ఎక్కడివక్కడ కూల్చేశాయి. పఠాన్‌కోట్‌లో రెండు, జమ్మూలో ఒక పాక్ యుద్ధ విమానాన్ని ఎస్-400 వ్యవస్థ నేలకూల్చింది. వాటిలో రెండు జేఎఫ్-%17, ఒక ఎఫ్%-%16 ఉన్నాయి. రెండు యుద్ధ విమానాలను నష్టపోయినట్టు పాక్ కూడా అంగీకరించింది. పఠాన్‌కోట్‌లో ఇద్దరు పైలట్లు మన బలగాలకు చిక్కినట్టు సమాచారం. ఆ వెంటనే పాక్‌పై సైన్యం విరుచుకుపడింది. ఇస్లామాబాద్, లాహోర్, సియాల్‌కోట్, కరాచీ, రావల్పిండిలపై దీర్ఘశ్రేణి క్షిపణులతో రెండోసారి భారీస్థాయిలో దాడులకు దిగింది. లాహోర్ తదితర నగరాల్లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నింటినీ సమూలంగా నాశనం చేసేసింది. పాక్‌లోని పంజాబ్ ప్రాంతంలో నెలకొన్న కీలక ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టం (ఏడబ్ల్యూఏసీఎస్)ను తుత్తునియలు చేసింది. పాక్ నగరాలు బాంబు పేలుళ్లతో దద్దరిల్లినా పౌర ఆవాసాలు, వ్యవస్థలకు నష్టం కలగని రీతిలో సైనిక వ్యవస్థలను మాత్రమే ఎంచుకుని అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించినట్టు సైన్యం పేర్కొంది.

### పలుచోట్ల బ్లాకౌట్

పాక్ దాడుల నేపథ్యంలో గురువారం రాత్రి సరిహద్దు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సైరన్ల మోత మోగింది. జమ్మూ కశ్మీర్, పంజాబ్, హరియాణా, రాజస్తాన్, గుజరాత్‌ల్లో పలుచోట్ల వైమానిక దాడుల హెచ్చరికలు జారీ అయ్యాయి. దాంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్, అమృత్‌సర్, హోషియార్‌పూర్, మొహాలీ, చండీగఢ్ మొదలుకుని రాజస్తాన్‌లోని జైసల్మేర్ దాకా పలు నగరాల్లో కరెంటు సరఫరా నిలిపేశారు. ఆయాచోట్ల రాత్రిపూట పలు డ్రోన్లతో పాటు పేలుడు శబ్దాలను గమనించినట్టు భద్రతా బలగాలు తెలిపాయి.

# పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా




(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక దాడుల్లో కేవలం ఉగ్రవాదులను మాత్రమే హతమార్చినట్లు- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పౌరులు చనిపోయారన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆయన ఖండించారు. భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు హాజరైన చిత్రాన్ని విక్రమ్ మిస్రీ ప్రదర్శించారు. శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి ప్రభుత్వ లాంఛనాలతో పౌరులకు అంత్యక్రియలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. మే 7న భారత్ జరిపిన సైనిక దాడులన్నీ జాగ్రత్తగా ఎంచుకున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద లక్ష్యాలపైనే అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. 'ఈ దాడుల్లో ఎవరైనా పౌరులు చనిపోతే, ఈ చిత్రం మీ అందరికీ ఎలాంటి సందేశాన్ని పంపుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది అడగాల్సిన ప్రశ్న. పౌరుల అంత్యక్రియల్లో శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి, ప్రభుత్వ గౌరవం ఇవ్వడం కూడా వింతగా ఉంది. హతమైన వ్యక్తులు ఉగ్రవాదులే. అలాంటి ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బహుశా పాకిస్థాన్‌లో ఒక ఆచారం కావచ్చు. ఇది మాకు పెద్దగా అర్థం కాలేదు' అని అన్నారు. అలాగే మతపరమైన ప్రదేశాలపై భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్ ఆరోపణలను కూడా విక్రమ్ మిస్రి ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని అన్నారు. కేవలం ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు సాగాయని అన్నారు. ఇకపోతే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఈ పాక్ సైన్యం కాల్పుల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. పహల్గామ్ దాడులకు పాల్పడింది తామేనని ఆర్‌టిఎ ప్రకటించిందని, అది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ అని తెలిపారు. అయితే, అంతర్జాతీయ సమాజానికి పాక్ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. ఉగ్రవాదులతో తమక సంబంధాలు లేవని పాక్ బుకాయిస్తోందన్నారు. పాక్‌లో టెర్రరిస్టులు లేరని ఆ దేశ మంత్రి నిస్సిగ్గుగా చెబుతున్నారని.. అనేక దాడుల్లో పాక్ ప్రమేయం ఉందని చాలా సార్లు రుజువైందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదే పాకిస్తాన్ అన్నారు. ముంబై సహా భారత్ లో జరిగిన పలు దాడులపై పాక్ హస్తం ఉందన్నారు. ఉగ్రవాదుల డిఎన్ఎ రికార్డులు, వారి అడ్రస్సులు పాక్‌కు అందించామని.. కానీ పాకిస్తాన్ ఏ అంశంలోనూ స్పందించేదని పేర్కొన్నారు. పాక్ ఏ తీవ్రతతో దాడి చేసిందో అదే తీవ్రతతో ప్రతిదాడి చేశామన్నారు. ఉగ్రసంస్థ గురించి ఐరాసకు పూర్తి సమాచారం ఇచ్చామని తెలిపారు. పాక్ పౌరులు తమ టార్గెట్ కాదని కేవలం ఉగ్రస్థావరాలు మాత్రమే టార్గెట్ చేశామని విక్రమ్ మిస్రీ వివరించారు.

## పాక్ ప్రధాని ఇంటి సమీపంలో భారీ పేలుళ్లు..

### నివాసం నుంచి షరీఫ్ తరలింపు



పాక్ ప్రధాని ఇంటి సమీపంలో భారత సైన్యం దాడితో భారీ పేలుళ్లు జరిగాయి. దాంతో ఇస్లామాబాద్‌లోని తన నివాసం నుంచి షెహబాజ్ షరీఫ్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించారు. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌పై భారత సైన్యం దాడి చేసింది. ఇస్లామాబాద్ టార్గెట్‌గా భారత్ డ్రోన్లు, మిస్సైల్‌లతో దాడికి దిగింది. పాక్ మిస్సైల్‌లను గాల్లోనే కూల్చి వేసిన భారత సైన్యం. జమ్మూలోని ఎయిర్‌పోర్టుపై 8 సూసైడ్ డ్రోన్లతో పాక్ దాడి చేయగా వాటిని సమర్ధవంతంగా తిప్పి కొట్టింది. జైసల్మేర్, అక్నూర్‌లో ఇద్దరు పాక్ పైలట్‌లను పట్టుకున్న భారత ఆర్మీ. మొత్తం 20కి పైగా పాక్ డ్రోన్లను కూల్చిన భారత సైన్యం. లాహోర్ , సియాల్ కోర్టులో కౌంటర్ ఎటాక్‌కు దిగిన భారత్ డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 14 మంది పాక్ సైనికులు హతమైనట్టు సమాచారం. సిస్టమ్‌ను యాక్టివేట్ చేసిన భారత్. జమ్మూ ఎయిర్‌పోర్టు టార్గెట్‌గా పాక్ దాడులు. ఈ దాడులతో ఎలాంటి నష్టం జరగలేదని, పాక్ దాడులను సమర్ధవంతగా తిప్పికొట్టామని భారత ఆర్మీ తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని ఎయిర్‌పోర్టులను హై అలర్ట్ చేసిన భారత్ సైన్యం. వరుస డ్రోన్ దాడులతో పాక్ ఉక్కిరిబిక్కిరి అయింది. ఇదిలా ఉండగా అమెరికా, యూకే, యూఏఈలతో టచ్‌లో భారత్. రంగంలోకి %గ్గాఖ%-23, శిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. తాజా పరినామాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ సమావేశం అయ్యారు. త్రివిధ దళాధిపతులు, %జణూ%తో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ భేటీ అయ్యారు.

### రంగంలోకి భారత నౌకాధళం

రంగంలోకి దిగిన భారత నౌకాధళం పాకిస్తాన్ ఆర్థిక రాజధాని కరాచీ సీ పోర్టుపై ప్రతీకార దాడి చేసింది. ఐఎన్ఎస్ విక్రాంత? నుంచి మిస్సైల్స్, డ్రోన్లను ప్రయోగించింది. ఈ పోర్టులో ఏడు భారీ పేలుళ్లు, ఎగిసిపడుతున్న మంటలు. కరాచీ పోర్టులో మొత్తం 10 పాక్ కార్గో నౌకలను ధ్వంసం చేసిన ఇండియన్ నేవీ. ఈ దాడుల్లో అనేక షిప్పులు ధ్వంసం అయ్యాయి. అరేబియా సముద్రంలో పాక్‌పై గురి పెట్టిన భారత నేవీ ఏకంగా 26 యుద్ధ నౌకలతో విరుచుకుపడుతూ పాక్‌ను వణికిస్తోంది.

### దేశంలో పలు ప్రాంతాల్లో రైళ్లు నిలిపివేత

తాజా పరినామాలతో దేశంలో ఢిల్లీ నుంచి జమ్మూ,గుజరాత్, రాజస్థాన్ వెళ్లే రైళ్లన్నీ రద్దు చేశారు. ఢిల్లీలో హై అలర్ట్

తాజా పరినామాలతో ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద భద్రత పెంచిన కేంద్ర ప్రభుత్వం. ప్రజలు బయటకు రావొద్దని ఆదేశించింది. భారీగా %చీా+%

# యాప్‌లకు ఏఐ ఏజెంట్లు

- శరవేగంగా నియమించుకుంటున్న కంపెనీలు
- 'గ్లోబర్ సీఆర్‌ఎం లీడర్ సేల్స్‌ఫోర్స్' నివేదికలో వెల్లడి
- రానున్న రెండేండ్లలో ఆయా కంపెనీల్లో కోడ్ జనరేషన్‌కు 100 శాతం ఏఐ వినియోగం



ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో కృత్రిమ మేథస్సు (ఏఐ) సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఏఐ ఏడాదిలోనే సాఫ్ట్‌వేర్ కోడ్‌లన్నింటినీ రాసేస్తుందని ఇప్పటికే పలువురు టెక్నాలజీ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనుషులు అందిస్తున్న కొన్ని సేవలను 'ఏఐ ఏజెంట్లు'గా పిలిచే యంత్రాలే చేయనున్నాయి మరి. ఇక ఆయా యాప్‌లను ఏఐ ఏజెంట్లు అభివృద్ధి చేయనున్నట్టు తాజాగా 'గ్లోబల్ సీఆర్‌ఎం లీడర్ సేల్స్ ఫోర్స్' తన నివేదికలో తెలిపింది. ఏఐతో ఉద్యోగ నియామకాల్లో సైతం భారీ మార్పులు వస్తాయని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్న నేపథ్యంలో దేశంలోని ప్రతీ 10మంది సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసే లీడర్లలో 9మంది యాప్‌లను అభివృద్ధి చేసేందుకు సంప్రదాయ సాఫ్ట్‌వేర్ టూల్స్‌గా ఏఐ ఏజెంట్లు అవసరమని భావిస్తున్నట్టు రిపోర్టు వెల్లడించింది. దేశంలోని సాఫ్ట్‌వేర్లను అభివృద్ధి చేసే లీడర్లు.. ఏఐ ఏజెంట్లను వేగంగా నియమించుకుంటున్నట్టు రిపోర్టు వెల్లడించింది. రానున్న అభివృద్ధి యుగంలో ఏఐ యంత్రాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపింది.

**91 శాతం ఏఐ ఏజెంట్ల నియామకం..**

మన దేశంలోని 100మంది, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 2 వేలమంది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లీడర్లు ఏజెంటిక్ ఏఐపై ఒకేలా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు ఈ నివేదిక వెల్లడించింది. సాఫ్ట్‌వేర్ల అభివృద్ధి భవిష్యత్తును రూపొందించడంలో ఏఐ సాధనాలు, ఏజెంట్ల ప్రాముఖ్యత పెరుగుతుండటం.. ఏఐ ఆధారిత అభివృద్ధివైపు స్పష్టమైన మార్పును సూచిస్తున్నట్టు అధ్యయనం తెలిపింది. భారత్‌లోని సాఫ్ట్‌వేర్ అభివృద్ధి లీడర్ల అభిప్రాయం ప్రకారం.. రానున్న రెండేండ్లలో 100 శాతం ఆయా కంపెనీల్లోని టీమ్‌లు కోడ్ జనరేషన్‌కు ఏఐని వినియోగించుకుంటాయని రిపోర్టు తెలిపింది. 91 శాతం కంపెనీల్లోని టీమ్‌లు ఏఐ ఏజెంట్లను నియమించుకుంటాయని వెల్లడించింది. ఏఐ ఏజెంట్లను నియమించుకునేందుకు ఆధునిక మౌలిక వసతులు, నైపుణ్యాలు, సామర్థ్యాలను పరీక్షించడం మరింత సవాలుగా మారనుందని 85 శాతం సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసే లీడర్లు అభిప్రాయపడినట్టు రిపోర్టు తెలిపింది. అయితే ఇందులో 40 శాతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లీడర్లు తమ వద్ద ఏఐ ఏజెంట్లను నియమించుకోవడానికి పరీక్ష సామర్థ్య ప్రక్రియ పూర్తిగా లేదని అభిప్రాయపడినట్టు రిపోర్టు వెల్లడించింది.

**కీలకంగా మారనున్న 'ఏజెంటిక్ ఏఐ'**

మనిషి జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేకుండా, స్వతంత్రంగా నిర్దిష్ట పనులను పూర్తి చేసేందుకు ఉపయోగపడే ఏఐ సిస్టమ్‌లను 'అటానమస్ ఏజెంట్లు'గా వ్యవహరిస్తారు. వివిధ పనులు, ప్రక్రియలను ఆటోమేట్ చేసేందుకు వీటిని వినియోగించుకునే విధానాన్ని ఏజెంటిక్ ఏఐగా పరిగణిస్తారు. అయితే డెవలపర్లు కోడ్ రాయడం, డీబగ్గింగ్ వంటి సాధారణ పనుల నుంచి మరింత వ్యూహాత్మకంగా, ప్రభావవంతంగా 'ఏజెంటిక్ ఏఐ' చొరవ చూపనున్నట్టు రిపోర్టు చెప్పింది. డెవలపర్లు లో-కోడ్, నో-కోడ్ సాధనాలతో నడిచే ఏజెంట్లను ఎక్కువగా ఉపయోగిస్తుండగా.. డెవలపర్ల కోడింగ్ సామర్థ్యాలతో సంబంధం లేకుండా.. అభివృద్ధి వేగంగా, సులభంగా, సమర్థవంతంగా మారనుంది.




## జియోకు పెరిగిన కస్టమర్లు

న్యూఢిల్లీ, మే 7: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో కస్టమర్లను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. మార్చి నెలలోనూ 21.74 లక్షల మంది జియో నెట్‌వర్క్ పరిధిలోకి చేరడంతో మొత్తం సంఖ్య 46.97 కోట్లకు చేరుకున్నారని టెలికం నియంత్రణ మండటి ట్రాయ్ వెల్లడించింది.

%అలాగే భారతీ ఎయిర్‌టెల్ పరిధిలోకి 12.50 లక్షల మంది చేరడంతో మొత్తం సంఖ్య 38.98 కోట్లకు చేరుకున్నారు. కానీ, వొడాఫోన్ ఐడియా మాత్రం 5.41 లక్షల మంది మొబైల్ కస్టమర్లను కోల్పోయింది. దీంతో కంపెనీ కస్టమర్ల సంఖ్య 20.53 కోట్లకు పడిపోయారు.

## 2 వేలకు పైగా యూపీఏ లావాదేవీలపై జీఎస్టీ విధించం

రూ.2 వేల కంటే అధికంగా జరిపే యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించే




ప్రతిపాదనేది తమ వద్దలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టంచేసింది. రెండు వేల రూపాయల కంటే అధిక లావాదేవీలపై జీఎస్టీ విధిస్తారని వస్తున్న వార్తను ఖండించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఈ వార్తలు అబద్దమని, తప్పుదారి పట్టించేది, ఎటువంటి ఆధారం లేనవని తెలిపింది. ప్రసుత్తం ఇలాంటి ప్రతిపాదనేది ప్రభుత్వం వద్ద లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. యూపీఐ లావాదేవీలు భారీగా పెరుగుతున్నాయని, 2019-20లో రూ.21.3 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీలు..మార్చి 2025 నాటికి రూ.260.56 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు.

## ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం పిలుపు

హైదరాబాద్, సింగరేణిలో అవినీతి దందాలపై ఉకు పాదం మోపుతామని.. అక్రమారుల గురించి ధైర్యంగా సమాచారం ఇవ్వాలని సంస్థ యాజమాన్యం పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మోసగాళ్ల సమాచారాన్ని కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నంబర్ 94911 44104కు గానీ, విజిలెన్స్ శాఖ మెయిల్ %జఅస్త్రదఏగ ంఎఆశ్రీఎఱఅవం. ఔశీఎ%కి గానీ, ఏసీబీకి అందించాలని కోరింది. సమాచారం ఇచ్చిన వారికి పూర్తి రక్షణతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది. ఆధారాలతో అక్రమారులను పట్టించిన వారికి రూ.10 వేల పారితోషకం ఇస్తామని ప్రకటించింది. బదిలీలు, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయించడం, డిప్యూటేషన్లు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ప్రకటన జారీ చేసింది.అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షించబోదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని సంస్థ గుర్తుచేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్టు వెల్లడించింది. సింగరేణిని అవినీతి రహిత సంస్థగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒకరూ సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

## లావాదేవీల్లో జాగ్రత్తలు తప్పనిసరి.. పరిమితి దాటితే పన్ను బాదుడు షురూ..!



భారతదేశంలోని బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం డిజిటల్ విప్లవం కొనసాగుతుంది. ముఖ్యంగా నోట్ల రద్దు తర్వాత తీసుకొచ్చి యూపీఐ చెల్లింపులు కారణంగా లావాదేవీల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అయితే బ్యాంకు ఖాతా నిర్వహణలో చేసే కొన్ని తప్పుల వల్ల ఆదాయపు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతా నిర్వహణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో? ఓ సారి తెలుసుకుందాం. దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్నాయంటే ప్రజలు తమ ఆర్థిక నిర్వహణ కోసం పొదుపు బ్యాంకు ఖాతాలను ఎక్కువగా వినియోగిస్తున్నారని అర్థం. అయితే ఆ ఖాతాలకు ఆర్థిక పరిమితి ఉందని అది దాటితే ఆదాయపు పన్ను శాఖ నోటీసులు ఇస్తుందనే విషయం చాలా మందికి తెలియదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రజలు ఒక ఆర్థిక సంవత్సరంలో తమ పొదుపు ఖాతాలో రూ. 10 లక్షల వరకు నగదు జమ చేయడానికి అనుమతి ఉంటుంది. అయితే ఈ పరిమితిని మించిపోవడం వల్ల ఆటోమెటిక్‌గా పన్ను విధించరు. అయితే ఆదాయపు పన్ను శాఖ అధికారులు మాత్రం నోటీసులు ఇస్తారు. వార్షిక సమాచార రిటర్న్ (ఏఐఆర్) ఫ్రేమ్‌వర్క్ కింద బ్యాంకులు అధిక విలువ కలిగిన నగదు లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖకు నివేదించాల్సి ఉంటుంది. మీ డిపాజిట్లు రూ. 10 లక్షల పరిమితిని దాటితే ఆ నిధుల మూలాన్ని మీరు వివరించాల్సి ఉంటుంది. మూలాన్ని అధికారులకు నివేదించడంతో ఇబ్బందులు ఎదురైతే ఆ మొత్తంపై 60 శాతం వరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత బ్యాంకుల్లో రూ. 50,000 వరకు నగదు డిపాజిట్ల కోసం మీరు మీ పాన్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. ఆ మొత్తాన్ని మించిన ఏదైనా లావాదేవీ చేయాలంటే కచ్చితంగా పాన్ వివరాలను అందించాల్సి ఉంటుంది. ఈ నిబంధన వల్ల లెక్కించని సంపదను పర్యవేక్షించడానికి, అలాగే బ్యాంకింగ్ మార్గాల ద్వారా సంభావ్య మనీలాండరింగ్‌ను అరికట్టడానికి వీలు అవుతుంది. అలాగే ప్రజలు స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు లేదా డిజిటల్ కెమెరాలు వంటి అధిక-విలువ కొనుగోళ్లకు రసీదులు, ఇన్‌వాయిస్‌లను నిర్వహించడం కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ఆదాయపు పన్ను అంచనాల సమయంలో ఈ రికార్డులు కీలకమైన డాక్యుమెంటేషన్‌గా ఉపయోగపడతాయి. ప్రత్యేకించి అలాంటి వస్తువుల విలువ మీరు నివేదించిన ఆదాయానికి అసమానంగా కనిపించినప్పుడు.



## మొదటి నెలలోనే రికార్డు సృష్టించిన భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ రైలు

భారత రైల్వేలు ఎల్లప్పుడూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ, కనెక్టివిటీకి వెన్నెముకగా ఉన్నాయి. ప్రయాణికులను చేరవేయడంతో, సుదూరాలకు వస్తువుల తరలింపును సులభతరం చేయడంలో ఇది ఎప్పుడూ కీలక పాత్ర పోషిస్తోంది. ఒక్కసారి మన రైల్వే గనక ఆగితే.. టోటల్ భారత దేశమే స్తంభించిపోతుంది. అంతటి శక్తివంతమైన వ్యవస్థ మన రైల్వే వ్యవస్థ. రైలు అన్నది కేవలం ప్రయాణికులను చేరవేసే యంత్రం కాదు. అది మన దేశం గుండె చప్పుడు. సిగ్నల్ లైట్ల మధ్య, గ్రామాల నుంచి నగరాలకు, సముద్ర తీరాల నుంచి హిమాలయాలకు, ఒక మనసును మరొక మనసుతో కలుపుతూ సాగుతుంది. ప్రయాణీకుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భారతదేశంలో వివిధ రకాల రైళ్లు నడుస్తాయి. భారతీయ రైల్వే నెట్‌వర్క్ ప్రపంచంలో రెండో అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్. రైల్వేలు ప్రతిరోజూ 13 వేలకు పైగా రైళ్లను నడుపుతున్నాయి. వీటిలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తారు. రైల్వే మంత్రిత్వ శాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని కూడా ప్రారంభించింది. దీని కింద 1000 కి పైగా రైల్వే స్టేషన్లను హైటెక్‌గా మార్చనున్నారు. అటువంటి పరిస్థితిలో, భారతదేశంలో కూడా ప్రైవేట్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ రైలు భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్.

# పసిడి దిగుమతులు హైజంప్

న్యూఢిల్లీ: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో బంగారం ధరలు మళ్లీ లక్ష రూపాయల మార్క్‌ను అధిగమించింది. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,000 ఎగబాకి రూ.1,00,750కి చేరుకున్నది. మంగళవారం ధర రూ.99,750 స్థాయిలో ఉన్నది.గత నెలలో బంగారం ధర రికార్డు స్థాయి రూ.1,01,600 కి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ తర్వాతి క్రమంలో అమెరికా-చైనా దేశాల మధ్య ప్రతీకార సుంకాల విధింపు తగ్గుముఖం పట్టడంతో మళ్లీ దిగొచ్చింది. పసిడితోపాటు వెండి మరింత ప్రియమైంది. కిలో వెండి రూ.440 అందుకొని రూ.98,940కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 62.12 డాలర్లు లేదా 1.8 శాతం తగ్గి 3,369.65 డాలర్లు నమోదవగా, వెండి 1.24 శాతం తగ్గి 32.81 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.



# బలూచీలో వరుస దాడులు

## ఐఈడి పేలుడుతో 14మంది పాక్ జవాన్ల దుర్మరణం

**ఇస్లామాబాద్,(క్రైమ్ మిర్రర్):** బీఎల్ఏ వరుస దాడులతో పాక్ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పాక్ ఆర్మీ వాహనంపై బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడి చేసింది. ఐఈడీ బాంబులతో పాక్ ఆర్మీ వాహనాన్ని పేల్చివేసింది. మాచ్‌కుండ్ ప్రాంతంలో బీఎల్ఏ దళాలు ఐఈడీ పేల్చాయి. ఈ దాడిలో 14 మంది పాక్ సైనికులు మృతి చెందారు. బలూచిస్థాన్‌లోని బిలాన్ పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరిగింది.వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు దాడుల్లో 14 మంది పాక్ ఆర్మీ జవాన్లు హతమయ్యారు. బిలాన్‌లోని మాచ్‌లోని షోర్కాండ్ ప్రాంతంలో పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై బీఎల్ఏ రిమోట్ క్రంటోల్ ఐఈడీ దాడి చేసింది. ఈ దాడిలో 12 మంది సైనికులు మరణించారు. మరణించిన సైనికుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ తారిక్ ఇమ్రాన్, సుబేదర్ ఉమర్ షరూక్ ఉన్నారు. ఈ పేలుడు ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఇక మరోచోట బీఎల్ఏ నిర్వహించిన రెండో దాడిలో ఇద్దరు పాక్ జవాన్లు మృతి చెందారు. కచ్‌లోని కులాగ్ టిగ్రామ్ ప్రాంతంలో పాక్ సైనికులను లక్ష్యంగా చేసుకుని ఐఈడీ పేలుడు బాంబులు అమర్చి ఇద్దరు సైనికులను హతమార్చారు. ఈ రెండు దాడులు తామే చేశామని బీఎల్ఏ ఓ ప్రకటనను కూడా విడుదల చేసింది. అంతే కాకుండా పాక్ ఆర్మీపై బీఎల్ఏ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్ ఆర్మీని కిరాయి ముఠాగా ప్రకటనలో తెలిపింది. కాగా.. రెండు రోజుల క్రితం కూడా బలూచిస్థానలో జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు పాక్ ఆర్మీ ప్రాణాలు కోల్పోయారు. కచ్ జిల్లాలోని మాచ్ ప్రాంతంలో పాక్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఐఈడీతో పేల్చేశారు. ఈ పేలుళ్లో ఏడుగురు పాక్ సైన్యం మృతి చెందారు. అయితే ఈ దాడికి పాల్పడింది బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఉగ్రవాదులుగా పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో వరుస పేలుళ్ల జరిగాయి.

## మద్యం స్కామ్ కేసులో
# నిందితులకు షాక్

### ధనుంజయ్ రెడ్డి తదితరకుల బెయిల్ తిరస్కరణ

### విచారణ ఈ నెల 13కు వాయిదా వేసిన సుప్రీం



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులకు సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసులో నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ ముగ్గురికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఈ కేసులో వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ ముగ్గురికి మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. ఈ కేసు మొదలైనప్పుడే ఈ ముగ్గురు కూడా ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు వచ్చారు. అయితే దీనికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. అక్కడ న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఇక్కడకు రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు చేసింది. ఈ క్రమంలో బుధవారం ఈ ముగ్గురు నిందితులు వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణకు వచ్చింది. కానీ వీరికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. దాంతో ఈరోజు సుప్రీం కోర్టు ముందుకు వచ్చిన ముగ్గురు నిందితులు.. హైకోర్టు నిరాకరించినందుకు తమకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని వినతి చేశారు. ఏపీ హైకోర్టులో వీరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించినందున.. హైకోర్టులో పెండింగ్‌లో ఉండగానే సుప్రీంలో దాఖలైన ఈ పిటిషన్ నిరర్ధకమైందని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో గతంలో వేసిన పిటిషన్‌ను సవరణ అయినా చేయాలి లేదా కొత్త పిటిషన్ అన్నా దాఖలు చేయాలని.. అంతవరకు దీనిని అనుమతించవద్దని ముకుల్ రోహత్గీ చెప్పారు. రోహత్గీ వాదనలతో ఏకభవించిన కోర్టు.. గతంలో వేసిన పిటిషన్‌ను సవరించి మరో పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. అయితే 13 వరకు తమను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని ముగ్గురి తరపున వాదించిన న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. కానీ మధ్యంతర రక్షణ కల్పించేందుకు కూడా సుప్రీం కోర్టు నిరాకరించింది. అప్పటి వరకు మిమ్మల్ని మీరే కాపాడుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. మధ్యంతర బెయిల్‌పై మళ్లీ పిటిషన్ దాఖలు చేసిన తర్వాత 13వ తేదీన సుప్రీం కోర్టు విచారణ జరిపి మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# పాక్‌తో సరిహద్దుల వద్ద నిఘా

### రాజస్థాన్ సరిహద్దు మూసివేత.. వ్యతిరేక పోస్టులపై అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరిక



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ఆపరేషన్ సిందూర్ తరవాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. నివురు గప్పిన నిప్పులా పరిస్థితి ఉంది. పాక్ ప్రతి దాడులకు పాల్పడుతుందనే సమాచారం మేరకు భారత్ అప్రమత్తం అయ్యింది. దాడులను ధీటుగా తిప్పికొట్టేందుకు సైన్యం సన్నద్ధంగా ఉంది. ఇకపోతే పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకొంటున్న రాష్ట్రాల్లో భద్రతా చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్ సరిహద్దును సీల్ చేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక భారత వాయుసేన కూడా పూర్తి అప్రమత్తంగా ఉంది. మే 9వ తేదీ వరకు జోధ్‌పూర్, బికనేర్, కిషన్‌ఘర్ విమానాశ్రయాలను మూసివేశారు. గగనతలంలో యుద్ధవిమానాల గస్తీ కాస్తున్నాయి. ఇక్కడ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను యాక్టివేట్ చేశారు. ఇక పంజాబ్‌లో ప్రభుత్వం కీలక చర్యలు తీసుకొంది. సరిహద్దుల్లోని ఆరు జిల్లాల్లో పాఠశాలలను మూసివేసింది. వీటిల్లో ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, ఫజ్లికా, అమృత్‌సర్, గురుదాస్‌పుర్, తార్న్ తరన్ ప్రాంతాల్లో 72 గంటలపాటు- స్కూళ్లను మూసివేశారు. రాష్ట్ర పోలీస్‌శాఖ, ఇతర దళాల్లో సెలవులను రద్దు చేసి.. సిబ్బంది తక్షణమే విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్లో నేడు కూడా పాకిస్థాన్ దళాలు శతఘ్ని గుండ్లను కాలుస్తున్నాయి. దీంతో మన సైన్యం దీటుగా బదులిస్తోంది. పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది. ఇప్పటికే వీటిల్లో ఒక జవాన్ సహా 13 మంది చనిపోయారు. మంగళవారం రాత్రి అందరూ నిద్రపోతున్నవేళ.. క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్‌తో పాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో విరుచుకుపడింది. సరిహద్దుకు ఆవల 100 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చింది. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకుంది. సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతిరేక ప్రచారంపై నిఘా ఉంచాలని కేంద్ర హోంశాఖ పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పలు రాష్ట్రాల సీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో హోం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు పలు సూచనలు చేసినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తోంది. ఈక్రమంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హోంశాఖ పలు సూచనలు చేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి, భారత్ భద్రత గురించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే ఖాతాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దేశం నుంచి లేదా విదేశాల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఆయా సోషల్ మీడియా ఖాతాలను వెంటనే బ్లాక్ చేయాలని పేర్కొంది. ఈసందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రభుత్వాలకు, భద్రతా దళాలకు మధ్య కమ్యూనికేషన్ సంబంధాలు పెంచాలని పిలుపునిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వేళ.. పాకిస్థాన్‌తో పాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ విరుచుకుపడింది. అక్కడి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చి పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.

### ప్రధాని మోడీ ..ఓ అనికేత్: పవన్ ట్వీట్




**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ సంచలన ట్వీట్ చేశారు. ప్రధాని మోదీని అనికేత్ అని అభివర్ణించారు. అనికేత్ ఒక పేరు, ఒక సంకల్పమని తెలిపారు. తన సన్యాసి జీవితంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అనికేత్ అని పిలిచేవారని పవన్ అన్నారు. అనికేత్ అంటే ఇళ్లు లేకుండా అని అర్థం అని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ప్రధాని గురించి పవన్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'అనికేత్' – ఒక పేరు, ఒక సంకల్పం. తన సన్యాసి జీవితంలో, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీనియస్ అని సంబోధించారు.

## సిబి అధికారిగా బెదరింపులు

### కూపీ లాగితే లేడీ పోలీస్ పాత్ర ఉన్నట్లు గుర్తింపు

**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** విశాఖపట్నంలో నకిలీ ఏసీబీ అధికారి కలకలం సృష్టించాడు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బలగా సుధాకర్ చాలాకాలం కిందట విశాఖలోని ఆదర్శనగర్ పాత డెయిరీఫారం వద్ద నివాసం ఉంటూ..రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ చక్రపాణిని కలిసి.. తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌నని పరిచయం చేసుకుని.. మీ ఆఫీస్‌లో అవినీతిపై తమకు చాలా ఫిర్యాదులు అందాయని, వాటిపై కేసు నమోదుచేయాల్సి ఉందంటూ బెదరించాడు.. అయితే, ఏసీబీ అధికారినంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేసిన అతడిని విశాఖ పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేశారు.. అయితే, నకిలీ ఏసీబీ అధికారి కేసులో సంచలన అంశాలు వెలుగు చూస్తున్నాయి.. నకిలీ ఏసీబీ అధికారి కేసులో ఊహించని ట్విస్ట్ వచ్చింది. నకిలీ ఏసీబీ వెనుక కిలాడీ లేడీ ఖాకీ ఉన్నట్టుగా అధికారులు చెబుతన్నారు.. ఆ కిలాడీ లేడీ ఖాకీ ఎవరో కాదు.. గతంలో నోట్ల మార్పిడి కేసులో సంచలనంగా మారిన రిజర్వుడు ఇన్స్పెక్టర్ స్వర్ణలత.. ఈ ఘటనతో లేడీ పోలీస్ స్వర్ణలత తన తీరు మార్చుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.. సస్పెండ్ అయ్యి జైలుకి వెళ్లొచ్చినా ఆమె వ్యవహార శైలిలో మార్పురాలేదు. మధురవాడ సబ్ రిజిస్టర్‌ను బెదిరించిన కేసులో ఈమె పాత్ర ఉందని తేల్చారు పోలీసులు... నకిలీ ఏసీబీ సుధాకర్ ను అడ్డుపెట్టుకొని డబ్బుల కోసం ఈ ఆగడాలకు దిగారట.. సుధాకార్ కాల్ లిస్ట్ ఆధారంగా స్వర్ణలత బండారం బట్ట బయలు అయినట్టు- అయ్యింది..

# ఎసౌదీ విదేశాంగ మంత్రి భారత్ రాక

(మొదటి పేజీ తరువాయి)




**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** భారత్-పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ.. సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీలో దిగారు. దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్‌జుబైర్ నేడు దిల్లీకి వచ్చి రావడంతోనే మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు- తెలుస్తోంది. దీనిపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఎక్స్‌వేదికగా పోస్టు చేశారు. సౌదీ అరేబియా మంత్రి అదెన్ అల్ జుబైర్‌తో సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని ఆయనకు వివరించానని జైశంకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా సౌదీ మంత్రితో భేటీ జరిగింది. ఆ తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చితో మన విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇప్పటికే భారత్-పాక్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. సోదరుల్లాంటి పొరుగుదేశాలే మాకు అత్యున్నత ప్రాధాన్యం అని పేర్కొన్నారు. అంతేకాదు.. భారత్, పాక్‌లోని తమ దౌత్యకార్యాలయాల సహకారంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గిస్తామని పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను కూడా అరాగ్చి ఎటు-వంటి ముందస్తు సమాచారం లేకుండానే సందర్శించారు. అక్కడి నాయకులతో చర్చించి.. తిరిగి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తర్వాత న్యూఢిల్లీకి వచ్చారు.

# భారత్ దెబ్బ... ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ సైరన్లు!

### భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు..ఇస్లామాబాద్‌లో మోగిన ప్రమాద ఘంటికలు

### పాక్ ప్రధాని కార్యాలయంలో అత్యవసర సమావేశం సందర్భంగా మోగిన సైరన్




భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో బుధవారం అలజడి రేగింది. 'ఆపరేషన్ సింధూర్' పేరుతో భారత్ చేపట్టిన ప్రతీకార చర్యల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ సైరన్లు మోగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇదే సమయంలో పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కార్యాలయంలో కీలక సమావేశం జరుగుతుండటం గమనార్హం.పహల్గామ్ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాల్పడేందుకు ప్రయత్నించిందని, అయితే భారత బలగాలు ఆ ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టాయని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్లు, కీలక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం దాడులు నిర్వహించింది. ముఖ్యంగా లాహోర్‌లోని పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను భారత దళాలు దెబ్బతీశాయి.కొన్ని గంటల క్రితం పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ వంటి ప్రధాన నగరాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. సరిగ్గా ఇదే సమయంలో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ప్రధాన మంత్రి కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరుగుతోంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో పాటు పలువురు ఉన్నతస్థాయి సైనిక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలో నెలకొన్న భద్రతా పరిస్థితులపై చర్చిస్తున్న తరుణంలోనే నగరంలో ఎమర్జెన్సీ సైరన్లు ఒక్కసారిగా మోగడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనతో పాకిస్థాన్ అధికార వర్గాలు అప్రమత్తమయ్యాయి.



# హెలికాప్టర్ కూలి ఆరుగురు పర్యాటకుల మృతి



**డెహ్రాడూన్,(క్రైమ్ మిర్రర్):** ఉత్తరాఖండ్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పర్యాటకులతో వెళ్తున్న ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు పర్యాటకులు మృతి చెందారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరకాశీలో గంగోత్రి వైపు వెళ్తున్న ఒక ప్రైవేటు- హెలికాప్టర్ గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో హెలీకాప్టర్‌లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఆరుగురు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.

## పోరాడుతూ మరణించాలంతే!

"తల్లి ఆశీర్వాదం బిడ్డకు ఎప్పుడూ తోడుంటుందంటారు. కానీ నా బిడ్డ విషయంలో మాత్రం అది శాపంగా మారింది" అంటోంది ఓ తల్లి. మరి ఆమె ఆశీర్వాదం తన బిడ్డకు ఎందుకు శాపంగా మారిందో తెలుసుకోవాలంటే 'గాంధారి' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయిక తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. దేవాశిశ్ మఖిజా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైనట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకుంది తాప్సి "సమయం వచ్చినప్పుడు నేను యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతూ మరణించాలి. కానీ ఎప్పుడూ శత్రువుల ముందు భయం ప్రదర్శించొద్దు. ఇప్పుడు పోరాటం ప్రారంభిద్దాం" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో ప్రతీకారం తీర్చుకునే ఓ శక్తిమంతమైన తల్లిగా కనిపించనుందామె. ఈ చిత్రాన్ని కనికా ధిల్లాన్ నిర్మిస్తోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది చిత్రబృందం.




# నేటి సమాజానికి దర్పణం



నూతన నటీనటులు, సీనియర్ యాక్టర్స్‌తో కలిసి దర్శకుడు గుణశేఖర్ రూపొందిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమిక, సారా అర్జున్, నాసర్, రోహిత్ తదితరులు ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా బుధవారం స్పెషల్ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. 'సమకాలీన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలకు దర్పణంలా ఉంటుంది. భూమిక పాత్ర భావోద్వేగాలతో సాగుతుంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, నిర్మాత: నీలిమా గుణ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గుణశేఖర్.

## అది నిజంగా నా విజయమే



'యానిమల్'కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ 'యానిమల్' తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాలభామ మరో అఛీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్స్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నా గురించి తెలుసుకోవాలని ఇంతమంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం 'యానిమల్'. థ్యాంక్యూ సందీప్ సార్. 'యానిమల్ 2' కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.'

# మరోసారి విలన్ పాత్రలో?



బాలీవుడ్ అగ్ర నటుడు సంజయ్‌దత్ తెలుగులో వరుసగా సినిమాలు చేస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్'లో ప్రతినాయకుడిగా నటించిన ఆయన ప్రస్తుతం ప్రభాస్ 'రాజాసాబ్'లో కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. 'అఖండ-2' చిత్రంలో కూడా సంజయ్‌దత్ విలన్‌గా నటించే అవకాశముందని ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఇదిలావుండగా ఆయన మరో తెలుగు చిత్రానికి ఓకే చెప్పారని, అందులో కూడా ప్రతినాయకుడిగానే కనిపించనున్నారని సమాచారం. వివరాల్లోకి వెళితే.. సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా 'సంబరాల ఏటిగట్టు' అనే చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. కేపీ రోహిత్ దర్శకుడు. దాదాపు వందకోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా సంజయ్‌దత్ నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ఇటీవలే దర్శకుడు ఆయన్ని కలిసి కథ చెప్పారని, తన పాత్రలోని కొత్తదనం నచ్చడంతో సంజయ్‌దత్ ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది.

## ఫేమస్ కొరియోగ్రాఫర్.. ఇప్పుడు వారసుడు కూడా




ప్రభుదేవా పేరు చెప్పగానే అద్భుతమైన డ్యాన్సులే గుర్తొస్తాయి. రీసెంట్ టైంలో పెద్దగా మెరుపుల్లేవ్. కొన్నాళ్ల ముందు వరకు పలు సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం నటుడిగా తమిళ మూవీస్ చేస్తున్నాడు. సరే ఇదలా ఉంచితే ఇప్పుడు డ్యాన్స్ తో తన వారసుడిని పరిచయం చేశాడు. ప్రభుదేవా.. చెన్నైలో తాజాగా ప్రభుదేవా లైవ్ డ్యాన్స్ పేరుతో కాన్సర్ట్ నిర్వహించాడు. దీనికి పలువురు హీరోయిన్లు, సెలబ్రిటీలు హాజరయ్యారు. ఈ వేడుకలోనే ప్రభుదేవా.. తన కొడుకు రిషి రాఘవేందర్ ని పరిచయం చేశాడు. ఇద్దరూ కలిసి డ్యాన్స్ కూడా చేయడం విశేషం.కొడుకు స్టేజీ పెర్ఫార్మెన్స్ వీడియో షేర్ చేసి తెగ ఎమోషనల్ అయిపోయాడు. కొడుకుని పరిచయం చేయడం ఎంతో గర్వంగా ఉందని, ఇది కేవలం డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ కాదని అంతకు మించి అని చెప్పుకొచ్చాడు. ఇకపోతే ప్రభుదేవాకు ఇద్దరు కుమారులు. వాళ్లలో రిషి ఒకడు. మరొకరు అదిత్.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.